నేటినిజం నేటినిజం నేటినిజం

**నమ్మలేని నిజాలు**

ఎబోలా వైరస్
లబోదిబో యాతన
చీడకు తెర.

పుత్తడి గిరి
రాయల జొన్నగిరి
సీమకు సిరి.

గాలి దుమారం
బీభత్స ధ్వంసఝంఝు
వాయునరకం.

పెరటి కోళ్లు
కుటీర పరిశ్రమ
బంగారు గుడ్డు.

కుట్టు గోవిందా
జిగురుతో దుస్తులు
టైలరింగ్ ఖతం.



- రేడియమ్
సెల్: 9291527757

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

**శ్రీనిజాలు**

రేవంత్ ఇరవయవ ఏట
రాజకీయ తొలిఅడుగులు!
జూలై నాల్గవ తేదిన
మిడ్జిల్ లో మలినుడుగులు!
వెయ్యేళ్ల ప్రయాణానికి
ఒక్క అడుగుతోను మొదలు
ఆగలేదు సాగలేదు
కొనసాగునా ఈ తుదలు?



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

హైదరాబాద్ గురువారం 2-7-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:256 పేజీలు:6 వెల: రూ.1/-


## ఆదాయ సమీకరణపై సీరియస్‌గా ఫోకస్ పెట్టండి..

### –అధికారులకు సీఎం రేవంత్ ఆదేశాలు



హైదరాబాద్, జులై 1: ఆదాయ సమీకరణపై అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర బడ్జెట్‌కు అనుగుణంగా లక్ష్యాలు సాధించాలంటే ఆదాయ సమీకరణపై సీరియస్‌గా దృష్టి సారించాలన్నారు. హెచ్ఎండిఏ, టిసిఐఐసి కమర్షియల్ ట్యాక్సెస్, ఎక్సైజ్‌తో పాటు వివిధ శాఖలకు సంబంధించి లీకేజీలు లేకుండా జాగ్రత వహించాలని సూచించారు. ఈరోజు(బుధవారం) ఎమ్‌సీఆర్‌హెచ్‌ఆర్‌డిలో రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ సమీకరణపై సమీక్ష నిర్వహించిన సీఎం.. అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు ఇచ్చారు. ఆదాయ సమీకరణకు సంబంధించి ఛేజింగ్ సెల్ నేర్పాటు చేసుకుని నిరంతరం ఫాలోఅప్ చేయాలన్నారు.

అనుకున్న స్థాయిలో పనిచేయాలంటే శాఖలవారీగా డిపార్ట్‌మెంట్స్ సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవాలని సీఎం సూచించారు. ఏఐ టెక్నాలజీని ఉపయోగించుకుని లబ్ధిదారుల జాబితాను డీబీటికి అనుసంధానం చేసుకోవాలని ఆదేశించారు. పెండింగ్ ప్రాజెక్టులను, ఇతర పనులను పూర్తి చేసేందుకు అనుగుణంగా బడ్జెట్‌ను తయారు చేసుకోవాలన్నారు. భూసేకరణను మొదటి ప్రాధాన్యంగా తీసుకోవాలని సూచనలు చేశారు. ఊహాజనిత బడ్జెట్ కాదని.. వాస్తవికత ఆధారంగానే బడ్జెట్‌ను రూపొందించుకోవాలని అధికారులకు తెలిపారు. వివిధ శాఖలకు అవసరమైన అన్ని రకాల సహకారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఆదాయం పెంపు, నిధుల సమీకరణ విషయంలో నిర్లక్ష్యం వీడాల్సిందే అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సలహాదారులు రామకృష్ణారావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఫిఫా ప్రపంచ కప్ సంబరాల్లో విషాదం.. ఇద్దరి మృతి




న్యూఢిల్లీ, జులై 1:ఫిఫా ప్రపంచ కప్ 2026లో సహ ఆతిథ్య దేశం మెక్సికో రౌండ్ ఆఫ్ 16కి అర్హత సాధించింది. 2–0తేడాతో ఈక్వెడార్‌ను చిత్తు చేసింది. దాదాపు 40 ఏళ్ల తర్వాత ప్రపంచ కప్‌లో నాకౌట్ దశను దాటింది. దీంతో అభిమానులు భారీ ఎత్తున సంబరాలు చేసుకున్నారు. అయితే ఈ వేడుకలు విషాదంగా మారాయి. బుధవారం జరిగిన ఈ సంబరాల్లో ఊపిరాడక ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయాన్ని మెక్సికో ప్రభుత్వం ధ్రువీకరించింది.

మృతుల్లో 19 ఏళ్ల యువతి, 44 ఏళ్ల వ్యక్తి ఉన్నట్లు అక్కడి ఆరోగ్య శాఖ వెల్లడించింది. అభిమానులు భారీ ఎత్తున సంబరాల్లో పాల్గొనడంతో ఉద్రిక్తత నెలకొంది.

ఒకరినొకరు నెట్టేసుకోవడంతో ఊపిరాడక ఆ ఇద్దరు మృతి చెందినట్లు అధికారులు పేర్కొన్నాడు. ఇదిలా ఉంటే, ఈ ఘటనలో మరో వ్యక్తి కూడా మృతిచెందినట్లు స్థానిక మీడియాలో కథనాలు వెలువడ్డాయి. కానీ ఈ విషయాన్ని అధికారులు ఇప్పటివరకు అధికారికంగా ధ్రువీకరించలేదు. ఈ ఘటనలో చాలా మంది తీవ్ర గాయాలపాలయ్యారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## సప్త పదులు

ప్రక్రియా సృజనకర్త: సుధామ



చెరువు
తరువు

నేటి
జీవనశైలిలో
అవి పూర్తిగా కరువు.

-యనమండ్ర నాగేశ్వరరావు
దయాల్బాగ్ (ఆగ్రా)

ఆకృతితో
వికృతితో

ప్రాణం
తేరుకోవాలంటే
అనుసంధానం
కావాలి ప్రకృతితో

-పాటిబండ్ల కవిత
విజయవాడ

ఆహారం
ఉపాహారం

ఆరోగ్యానికి
ఎంతో మంచిది
తీసుకుంటే
మితాహారం

-తిప్పావఝుల నరసింహమూర్తి
బుచ్చిరెడ్డి పాలెం

బుడుగులు
గొడుగులు

ఉల్లాసం
ఉత్సాహంతో
బడికి బుడిబుడి
అడుగులు

-అచ్యుతునిరాజ్యశ్రీ
హైదరాబాదు

కదలడు
మెదలడు
అవినీతికి
అలవాటుపడ్డ
అధికారి
కుర్చీని వదలడు

-కాయల నాగేంద్ర,
హైదరాబాద్

## బైక్ దొంగతనాల ముఠా అరెస్ట్.. 5 ద్విచక్ర వాహనాల స్వాధీనం

హైదరాబాద్, జులై 1: బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు పాత నేరస్థులను అరెస్ట్ చేసిన పోలీసులు.. రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి 5 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు సీఐ నాగేశ్వరరావు తెలిపారు.

శివరాంపల్లి పిల్లర్ నంబర్ 295 వద్ద రాయల్ ఎన్‌ఫీల్డ్ దొంగతనంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. సీసీటీవీ కెమెరాల ఆధారంగా దొంగలను అత్తాపూర్ పోలీసులు గుర్తించారు.

అరెస్ట్ అయిన వారిలో మహమ్మద్ షానవాజ్, మహమ్మద్ మొయిజ్ మోహియుద్దీన్ ఉన్నారు. పరారీలో ఉన్న శాస్త్రీపురానికి చెందిన నూర్, ఫర్హాన్ కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. వీరంతా జల్సాలు, చెడు వ్యసనాల కోసమే బైక్ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలింది. స్వాధీనం చేసుకున్న వాటిలో రాయల్ ఎన్‌ఫీల్డ్, సుజుకి బర్గ్‌మన్, యాక్టివా వాహనాలు ఉన్నాయి. అరెస్ట్ అయిన వారు గతంలోనూ పలు కేసుల్లో నిందితులుగా ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

## మేం శాంతి చర్చలకు సిద్ధం, చర్చలు విఫలమైతే యుద్ధానికీ సిద్ధం..

### –అమెరికాకు ఇరాన్ స్ట్రాంగ్ వార్నింగ్

న్యూఢిల్లీ, జులై 1: ఖతార్ రాజధాని దోహా వేదికగా అమెరికా తో కీలకమైన చర్చలు ప్రారంభం కానున్న నేపథ్యంలో అగ్రరాజ్యానికి ఇరాన్ గట్టి హెచ్చరికలు చేసింది. తాము దౌత్యపరమైన శాంతి చర్చలకు కట్టుబడి ఉన్నామని, ఒకవేళ ఈ చర్చలు విఫలమై ఇచ్చిన మాట తప్పితే మాత్రం యుద్ధానికి కూడా సిద్ధమేనని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్, చర్చల ప్రధాన ప్రతినిధి మహమ్మద్ బాగెర్ గాలిబాఫ్ స్పష్టంచేశారు.

శుద్ధిచేసిన యురేనియంతో కూడిన తమ దేశ అణు హక్కుల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, అది ఇరాన్ విధించుకున్న 'రెడ్ లైన్' అని ఆయన తేల్చి చెప్పారు. అమెరికా–ఇరాన్ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందంలోని కొన్ని కీలక నిబంధనలను పూర్తిగా అమలుచేసే వరకు తాము తదుపరి దశకు వెళ్లబో మని ఇరాన్ స్పష్టంచేసింది. ముఖ్యంగా లెబనాన్‌లో యుద్ధాన్ని ముగించి దాని సార్వభౌమత్వాన్ని కాపాడటం, ఇరాన్ చమురు ఎగుమతులు, అలాగే వ్యూహాత్మక హర్మూజ్ జలసంధి గుండా నౌకల రాకపోకల భద్రత వంటి అంశాలపై పట్టుబట్టింది.

గతంలో 2015 నాటి అణు ఒప్పందం విషయంలో అమెరికా ఇచ్చిన హామీలను ఉల్లంఘించిన తీరును గాలిబాఫ్ ఈ సందర్భంగా విమర్శించారు. లెబనాన్, ఇజ్రాయెల్ దేశాల మధ్య సంబంధాల సాధారణీకరణ కోసం అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ప్రయత్నిస్తున్నారని, ఇది ప్రస్తుత అవగాహన ఒప్పందానికి విరుద్ధమని ఆరోపించారు.

## రాధశ్రీ రాగాలు

రస కవన భూపతిని
రమ్యమగు సత్కృతిని
ప్రియమగు రసాకృతిని
మెచ్చు రాధశ్రీ
సకారాత్మక ఖనిని
సాహితీ రసధునిని
ఆలోచనామయుని
మెచ్చు రాధశ్రీ




-రాధశ్రీ
సెల్:9494481210

## వెనెజువెలాలో భారత వైద్యుల సేవల్ని కొనియాడిన ప్రధాని మోదీ

న్యూ ఢిల్లీ, జులై 1: భూకంపంతో అతలాకుతలమైన వెనెజువెలాలో మానవతా దృక్పథంతో భారత్ చేపట్టిన 'ఆపరేషన్ అమిస్తాద్' లో అహర్నిశలు శ్రమిస్తున్న భారతీయ వైద్య బృందాలు, సైనిక వైద్యులపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసలు కురిపించారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ఇవాళ ప్రధాని 'చీ' వేదికగా వైద్యులకు అభినందనలు తెలిపారు.

సమాజం ఎదుర్కొనే ఎలాంటి సవాలునైనా అధిగమించడంలో వైద్య నిపుణులు ఎల్లప్పుడూ ముందుంటారనే దానికి వెనెజువెలాలో మన వైద్యులు చేస్తున్న సేవలే నిదర్శనమని ప్రధాని కొనియాడారు. నేడు జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా దేశంలో వైద్య సేవల అభివృద్ధికి తీసుకుంటోన్న చర్యల్ని ఈ సందర్భంగా ప్రధాని వివరించారు.

## కరీంనగర్‌లో మరో ఎలక్ట్రిక్ బస్సులో మంటలు..



కరీంనగర్, జులై 1: కరీంనగర్ జిల్లాలో మరో ఆర్టీసీ బస్సు అగ్నికి ఆహుతైంది. కరీంనగర్ 2 డిపోలో నిలిపి ఉంచిన బస్సులో బుధవారం ఉదయం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అకస్మా?త్తుగా మంటలు చెలరేగడంతో క్షణాల వ్యవధిలోనే మంటలు వ్యాపించి బస్సు పూర్తిగా దగ్ధమైంది.

డిపోలో నుంచి ఎలక్ట్రిక్ బస్సును బయటకు తీస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. బస్సులో మంటలు రాగానే అప్రమత్తమైన సిబ్బంది వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటిన అక్కడకు చేరుకున్న సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. మంటలు పక్కనే ఉన్న ఇతర బస్సులకు వ్యాపించకుండా చర్యలు చేపట్టడంతో పెనుప్రమాదం తప్పింది. ప్రమాద సమయంలో బస్సులో ప్రయాణికులు ఎవరూ లేకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. కాగా, ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమా... బ్యాటరీలో సాంకేతిక లోపం కారణమా.. అనే కోణంలో అధికారులు దర్యాప్తు చేపట్టారు.

కాగా ఈ బస్సు ప్రమాదంపై ఆర్టీసీ రీజినల్ మేనేజర్ రాజు స్పందించారు. ఉదయం డిపో నుంచి ఎలక్ట్రిక్ బస్సును బయటకు తీస్తున్న సమయంలో ఒక్కసారిగా పొగలు రావడాన్ని డ్రైవర్ గమనించాడని తెలిపారు. వెంటనే అప్రమత్తమైన డ్రైవర్ బస్సును ఆపేసి ఫైర్ సిబ్బందికి సమాచారం అందించాడని పేర్కొన్నారు. వరుసగా జరుగుతున్న ఈ ప్రమాదాలపై ఉన్నతస్థాయిలో దర్యాప్తు జరుగుతుందని తెలిపారు.

## విద్యార్థులు నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలి :రాష్ట్రపతి ద్రౌపది ముర్ము





అమరావతి, జులై 1: నూతన సాంకేతికతను విద్యార్థులు అందిపుచ్చు కోవాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సూచించారు. అనంతపురం లోని ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ వర్సిటీ తొలి స్నాతకోత్సవంలో పాల్గొని ప్రతిభ చూపిన విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ వర్సిటీకీ మంచి గుర్తింపు ఉందన్నారు. వర్సిటీలో కష్టపడ్డ విధంగానే భవిష్యత్‌లోనూ ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలన్నారు.

సవాళ్లను అధిగమించేలా ప్రణాళికులు రూపొందించుకోవాలని సూచించారు. కొత్త ఆలోచనలతో నూతన సాంకేతికతకు నాంది పలకాలని కోరారు. వికసిత్ భారత్ 2047 లక్ష్యాల సాధనలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ నజీర్ అహ్మద్ మాట్లాడుతూ అనంతపురం జిల్లా ఎడ్యుకేషనల్ హబ్‌గా ఎదుగుతోందని అన్నారు. ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, మంత్రులు పాల్గొన్నారు.

### సెంట్రల్ యూనివర్సిటీ ఏర్పాటు: గవర్నర్ అబ్దుల్ నజీర్

రాష్ట్ర విభజన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగానే ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయాన్ని అనంతపురం జిల్లాలో ఏర్పాటు చేశారని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ తెలిపారు. బుధవారం జంతలూరులోని ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ యూనివర్సిటీ తొలి స్నాతకోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన పట్టభద్రులను ఉద్దేశించి ప్రసంగించారు.

ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవం విశ్వవిద్యాలయ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే మైలురాయని గవర్నర్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలనే ఉద్దేశంతో రాష్ట్ర విభజన సమయంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ఫలితంగానే ఈ విశ్వవిద్యాలయం ఆవిర్భవించిందని తెలిపారు.

2018లో స్థాపించబడిన ఈ విశ్వవిద్యాలయం రాయలసీమ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చిందన్నారు. శ్రీకృష్ణదేవరాయల పాలనలో వెలుగొందిన విజయనగర సామ్రాజ్య వారసత్వంతో పాటు ఖనిజ సంపద, పట్టు పరిశ్రమ, ఉద్యాన పంటలకు ప్రసిద్ధి చెందిన ప్రాంతం రాయలసీమ అని వివరించారు. అనంతపురం విద్యా రంగంలో కీలక కేంద్రంగా అభివృద్ధి చెందిందని, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, జేఎన్‌టీయూ, శ్రీ సత్యసాయి ఉన్నత విద్యా సంస్థ, ప్రభుత్వ వైద్య కళాశాల, శతాబ్దానికి పైగా చరిత్ర కలిగిన ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలతో పాటు అనేక విద్యాసంస్థలు ఇక్కడ ఉన్నాయని పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం రాష్ట్ర ఉన్నత విద్యా రంగంలో కొత్త అధ్యాయానికి నాంది పలికిందని గవర్నర్ అన్నారు. సామాజిక, సాంస్కృతిక అవసరాలకు అనుగుణంగా వినూత్న విద్యా కార్యక్రమాలను రూపొందిస్తూ భవిష్యత్తులో ఈ విశ్వవిద్యాలయం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

విలువల ఆధారిత విద్య, పరస్పర చర్చలకు ప్రాధాన్యమిచ్చే బోధన, ప్రత్యక్ష అనుభవాధారిత అభ్యాసం ద్వారా విద్యార్థులను విజ్ఞానవంతులుగా, బాధ్యతాయుతమైన భారత పౌరులుగా తీర్చిదిద్దేందుకు విశ్వవిద్యాలయం కృషి చేస్తోందని కొనియాడారు. పరిశ్రమలతో భాగస్వామ్యాన్ని పెంపొందిస్తూ, స్వల్పకాలిక, దీర్ఘకాలిక వృత్తి విద్యా కోర్సులు, బహుళ విభాగాల కోర్సులను ప్రవేశపెట్టాలనే లక్ష్యం అభినందనీయమన్నారు.

జాతీయ విద్యా విధానం–2020 బహుళ విభాగాల విద్యకు ప్రాధాన్యం కల్పిస్తోందని గవర్నర్ పేర్కొన్నారు. విజ్ఞానశాస్త్రంతో పాటు కళలు లేదా ఒక ప్రధాన విద్యా విభాగంతో పాటు మరో విభాగాన్ని అభ్యసించే అవకాశాన్ని ఈ విధానం కల్పిస్తోందని చెప్పారు. దీంతో విమర్శనాత్మక ఆలోచన, సమస్యల పరిష్కార సామర్థ్యం వంటి నైపుణ్యాలు పెంపొందుతాయని వివరించారు.

ఎంపిక ఆధారిత క్రెడిట్ విధానం, బహుళ ప్రవేశ నిష్క్రమణ అవకాశాల ద్వారా సమగ్ర విద్యను అందించడమే జాతీయ విద్యా విధానం లక్ష్యమని తెలిపారు. ఆత్మనిర్భర్ భారత్, వికసిత్ భారత్–2047 లక్ష్యాల సాధనలో ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం వంటి ఉన్నత విద్యా సంస్థలు అత్యంత కీలక పాత్ర పోషించాలని సూచించారు.

పట్టభద్రులైన విద్యార్థులకు ఇది విద్యా జీవితానికి ముగింపు కాదని, కొత్త జీవితానికి ఆరంభమని గవర్నర్ అన్నారు. నిరంతరం నేర్చుకుంటూ, ఆత్మవిశ్వాసంతో లక్ష్యాలను సాధించే దిశగా ముందుకు సాగాలని సూచించారు. స్వామి వివేకానంద సందేశాన్ని ఉటంకిస్తూ, "'నేను చేయలేను' అని ఎప్పుడూ అనొద్దు. మీలో అపారమైన శక్తి ఉంది. మీరు ఏదైనా సాధించగలరు" అని విద్యార్థులకు స్ఫూర్తినిచ్చారు.

తల్లిదండ్రుల త్యాగం, ప్రేమ, ప్రోత్సాహం వల్లే విద్యార్థులు ఈ స్థాయికి చేరుకున్నారని పేర్కొంటూ వారికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. కార్యక్రమానికి ఆహ్వానించిన ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ ఎస్.ఏ. కోరికి గవర్నర్ కృతజ్ఞతలు తెలిపారు.

## బహుముఖ ప్రజ్ఞాశాలి పి.వి. నరసింహారావు



'పి.వి.నరసింహారావు–ఒక వాక్చిత్రం' పుస్తకావిష్కరణలో ప్రభుత్వ సలహాదారు డా॥ కె.కేశవరావు, డా॥ కె.వి.రమణాచారి, టి ఉదయవర్లు తదితరులు.

హైదరాబాద్, జులై 1: పి.వి. నరసింమారావు బహుముఖ ప్రజ్ఞాశాలి అని వక్తలు అన్నారు. శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం ఆధ్వర్యంలో భారతపూర్వ ప్రధాని పి.వి. నరసింహారావు జయంతి సభను మంగళవారం సాయంత్రం నిర్వహించారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కె.వి.రమణాచారి అధ్యక్షతన జరిగిన సభలో ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.కేశవరావు పాల్గొని పి.వి. నరసింహారావు స్మారక ప్రసంగం చేశారు. అనంతరం భారతరత్న 'పి.వి.నరసింహారావు–ఒక వాక్చిత్రం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. వ్యాసరచన పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. పి.వి. కుమారులు పి.వి. ప్రభాకరరావు, భాషా నిలయం గౌరవ కార్యదర్శి టి. ఉదయవర్లు పాల్గొన్నారు.

## మహిళా సంఘాలకు రూ.1.50 కోట్ల రుణాల పంపిణీ



నిజామాబాద్, జులై 1: నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గంలోని భీమ్‌గల్ మండలం పిప్రి (జె), బాచన్‌పల్లి గ్రామాలకు చెందిన మహిళా సంఘాల సభ్యులకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పల్లికొండ శాఖ ఆధ్వర్యంలో బుధవారం రూ.1.50 కోట్ల విలువైన రుణాలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులకు రుణ మంజూరు పత్రాలను బ్యాంకు అధికారులు అందజేశారు. బ్యాంకు అధికారులు మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి రంగంలో ముందుకు సాగేందుకు, చిన్న వ్యాపారాలు, పాడి పరిశ్రమ, కిరాణా దుకాణాలు, కుట్టు కేంద్రాలు, వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలను అభివృద్ధి చేసేందుకు ఈ రుణాలు ఉపయోగపడతాయని తెలిపారు.

రుణాలను సద్వినియోగం చేసుకొని కుటుంబాల ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు.

ఐకేపీ అధికారులు మాట్లాడుతూ మహిళా సంఘాలు రుణాలను సకాలంలో తిరిగి చెల్లిస్తూ మంచి క్రెడిట్ చరిత్రను కొనసాగించాలని, తద్వారా భవిష్యత్తులో మరింత అధిక మొత్తంలో రుణాలు పొందే అవకాశం ఉంటుందని వివరించారు.

ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ శ్రవణ్ కుమార్, ఐకేపీ సీసీ పురస్తు నరేష్, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ సంఘాల నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## చురక

గోడకు తగిలించిఉన్న
గొప్పవాడె అతడు గన్ను
పేలకుంటే సమయానికి
ప్రజలకెట్ల వెన్నుదన్ను
పవరంతా పడిపోయిన
పార్టీకతడే పెద్ద దిక్కు
స్టీరింగును తిప్పకుంటే
చలిస్తుందా కారు టెక్కు



-వేల్పుల నారాయణ
9440433475

నేటి నిజం
# సాహితీ కెరటాలు
website: www.netinijam.com

2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 గురువారం 2-7-2026


## రెప్పలు దాటిన ప్రేమ

రెప్పలు దాటని లోకం
నన్ను రెప్పలనిండా దాచుకున్న స్నేహం.

పుస్తకం అంకితం తీసుకోవడం
ఒక మంచి మనిషి ప్రేమను పొందడం.

నేనూ, గోపీ సార్, ఎక్కువగా మాట్లాడుకోం
కానీ, మాట్లాడుకోకుండా, ఒక్కదినం కూడా వుండం.

నాకు కవిత్వం గురించి ఏమీ తెలియదు
కానీ, గోపీ సార్ రాసిన, ప్రతీ కవితను వింటాను.

నాకు చర్చించడం రాదు
కానీ, సార్ ఆత్మీయతలో గెలవడం నేర్చుకొన్నాను.

నేను ఒక్కరోజు ఫోన్ చేయడం ఆలస్యమైతే
నేను తప్పిపోయినట్టు, బెదిరిపోయి ఫోన్ చేస్తారు.

ఎప్పుడు పోగొట్టుకొన్నదో ఈ పిలుపు
గుండెలో మృదువుగా ప్రతిధ్వనిస్తుంది.

నేను, గోపీ సార్ కు, దేనిలోనూ సమానం కాను
అయినా, తనపుస్తకాన్ని అంకితం చేసి,
మాబంధాన్ని అపురూపం చేశారు.

నా కవిత్వాన్ని, సాన్నిహిత్యాన్ని గౌరవించారు
సార్, నా కళ్లల్లో తడి బిందువై నిలిచారు.
గోపీ సార్ రుణం ఎలాతీర్చుకోవాలి ?!
అంతెత్తు వ్యక్తిత్వానికి,
ఎన్ని కృతజ్ఞతలు తెలుపాలి !?



–ఆశారాజు
9392302245

## మాతృదినోత్సవం సందర్భంగా'అమ్మ' అంశం మీద అక్షరయాన్ తెలుగు విమెన్‌రైటర్స్ ఫౌండేషన్ నిర్వహించిన కవితల పోటీలో బహుమతులు పొందిన కవితలు.




డా।। శ్రీమతి ఆలూరి విజయలక్ష్మికి ప్రధమ బహుమతిని ప్రదానం చేస్తున్న సి. పార్థసారథి, ఐఏఎస్ (రి)

### పునరుత్థానం

ఉదయ కిరణాల కెరటాలపై తూగే
వన్నెల స్వప్నాల నావలా,
కోకిలమ్మ పాటలతో తరలి వచ్చిన
వర్ణశోభిత చైత్రరథంలా,
మంచి గంధపు దారుల్లోకి
నిశ్శబ్దంగా నడిచొచ్చిన
నిండు పున్నమిలా,
నాతలపుల పూలజల్లుల పరవశంతో,
అరమోడ్పు కన్నులతో
కడుపును స్పర్శించుకుంటున్న నీరూపం
ఇంకా నా ఊహల్లో తాజాగా ఉంది.
నీలో ఒదిగి మెదులుతూ, కదులుతూ,
పల్టీలు కొడుతూ, దూకుతూ, మెలితిరుగుతూ
ఈదుతూ, ఆవులిస్తూ, నిద్రిస్తూ, వింటూ
నేను అల్లరి చేస్తున్నప్పుడు
మందహాసంతో నువ్వు అందించిన వెచ్చదనం
ఇంకా నన్ను స్పర్శిస్తూనే వుంది.
మృత్యుశీతల పరిష్వంగాన్ని ఛేదిస్తూ
నీమృదు అధరాల మధ్య బాధను బంధిస్తూ
స్మజనకూ, మరణానికీ మధ్య
లోలకంలా తిరుగుతూ
నన్నీ భువి పైకి తరలించి
నా అణువణువు పై నువ్వు కురిపించిన
ముద్దుల తడి ఇంకా ఆరలేదు.
పరచుకున్న పచ్చని పైరుల్ని పలకరిస్తూ,
హరితవనాల ప్రాణవాయువును
ఆస్వాదిస్తూ,
పెరటి తోటలో పాదులు చేస్తూ,
చిలికి చిలికి తీసిన వెన్న ముద్దల్ని
వెండిగిన్నెలోకి తీస్తూ,
స్వేదం తో తడిచిన నీ మెడను చుట్టుకుని
ఉయ్యాలలూగిన
నన్నింకా ఆ లయ ఊపుతూనేఉంది.
చుక్కల పందిరి క్రింద
నన్ను ఒడిలో పొదవుకుని, గోరుముద్దలు తినిపిస్తూ,
నువ్వు జాబిల్లి వంక చూపించినప్పుడు, ఆకాశంలో కాక
నీ కళ్ళల్లో కనిపించిన జాబిలమ్మ
ఇంకా అక్కడే చిరునవ్వులు చిందిస్తూంది.
నేను బుడి బుడి నడకలు నేర్చుకుంటున్నప్పుడు
నావేలిని అందుకుని
బ్రతుకు బాటలోకి నడిపించిన నీ వేలు
నాగమనాన్ని, గమ్యాన్ని నిర్దేశించి,
ఒక్కొక్క మెట్టునూ పదిలంగా ఎక్కించి నా చేతికి
జయ పతాకను అందించింది.
నన్ను పలకరించిన ప్రతి భాగ్య వీచిక లోనూ
నీ ఆశీస్సుల పన్నీరును చిలకరించింది.
బ్రతుకులో కరిమబ్బులు కమ్మినప్పుడు,
సమస్యల చీకటి గదిలో బందీనై
కాంతిపుంజాలకోసం పరితపిస్తున్నప్పుడు,
నువ్వు వెలిగించిన ఆశల దివ్వెలు
నాదారిని దీప్తివంతం చేసాయి.
అమ్మా! నువ్వు నాకు బ్రతుకునిచ్చావు
బ్రతకడం నేర్పావు..ఎదగడం నేర్పావు,
శిఖరాలపైకి ఎగబాకడం నేర్పావు
రెక్కలు విప్పిన విహంగం లా
విజయాల సందిట్లోకి ఎగరడం నేర్పావు.
కాని..నువ్వు నేర్పినవే తప్ప నేను
స్వయంగా నేర్చుకోవాల్సిన నైపుణ్యాలను నేర్చుకోనేలేదు,
జీవితోత్సవపు సుస్వరాల్ని సృజించే
సరిగమల్ని మీటడం నేర్చుకోనేలేదు.
అమ్మను, అర్ధాంగినీ సన్నిహితంచేసి
వారి అనురాగ ఆలాపనల్ని ఏకంచేసి
ఒక సుమనోహర సుమధుర రాగాన్ని
సృజించుకునే నిపుణతను సాధించుకోనే లేదు.
"నేను" కేంద్రంగా నువ్వు, నీకోడలు
స్పర్ధల గోడల్ని నిర్మించుకుంటూంటే
వాటిని నివారించడం,నిర్మూలించడం
ఎలాగో తెలియని అయోమయంలో కూరుకుని
తరతరాలుగా పురుషజాతి
సృష్టించి, అనుసరిస్తున్న
అమానవీయ భావ సుడిగుండంలో
పడకుండా తప్పించుకోలేక,
"స్త్రీకి స్త్రీయే శత్రువు" అనే
పాత మురికి పాటనే జపిస్తూ,
స్త్రీ జాతిని విభజించి పాలించే
దుష్ట పితృస్వామ్య బాకాను
నిశ్శబ్దం చేసే వివేకం లేక,
నాలోని కొడుకుతోపాటు "మనిషి" కూడా మాయమై
గురిపెట్టి విసిరిన బాణం గుచ్చుకున్న గువ్వ
పిట్టలా విలవిలలాడుతున్న నిన్ను వృద్ధాశ్రమంలోకి నెట్టేసి
జడమై ఒరిగిన ఆత్మతో ఒంటరిగా ఇంటికి చేరాక
నువ్వు లేని మహాశూన్యం నన్ను ఒణికించింది.
నీచూపు, నీపిలుపు,
నీ స్పర్శ లేని బ్రతుకు నన్ను భీతిల్ల జేసింది.
నీనయనాల్లో ఘనీభవించిన పెను విషాద హిమజ్వాల
నన్ను వెంటాడి, వెంటాడి
మత్తిల్లిన నా అంతరాత్మను మధించింది.
పేరుకున్నమలిన విష భావాల్ని దహించింది.
పునరుత్థానం చెందిన "వివేకం" మెల్లగా కళ్ళు విప్పింది,
నీస్మృతుల సుధామధుర గానం
రోదిస్తున్న నాహృదయాన్ని ఊరడించింది?
మావిచిగుళ్ళను తాకి వచ్చిన చిరుగాలి
తెగిపడిన పూలసరంలా ఉన్న
నామనసును సేదదీర్చింది,
తరలివచ్చిన వసంతహేల ధైర్యం చెప్పి
నీ సమక్షానికి నన్ను చేర్చింది
నీ క్షమతో పునీతుడయే ఈ పురుషుడు
తల్లిగా, చెల్లిగా, పత్నిగా, పుత్రికగా,
అత్తగా, కోడలిగా సామాజీకరింపబడి
కలహాల ఊబిలో చిక్కుకొని దూరమవుతున్న స్త్రీ మూర్తులను
స్నేహంతో, సౌజన్యంతో, సహృదయంతో సన్నిహితం చేసే
శాంతి, సౌభాగ్య, సంతోషాల
సృజనోత్సవానికి నీ కుమారుడు సూత్రధారి అవుతాడు
విభజనలు లేని భవ్య సంస్కృతిలోపాత్రధారి అవుతాడు.
ఆ వెలుగు దారుల్లోకినీనందనుడిని నడిపించడానికి
దీపధారివై నీ ఇంటికి తిరిగి రామ్మా!

–డా।।ఆలూరి విజయలక్ష్మి
సెల్: 9849022441



నస్రీన్ ఖాన్‌కు ద్వితీయ బహుమతిని ప్రదానం చేస్తున్న సి. పార్థసారథి, ఐఏఎస్ (రి)

### నీవో సమస్తానివి

నాదైన దృష్టితో మిణుగురులా
ప్రకాశించాలనుకుంటున్నాను.
రెక్కల ఇంధనమే నీవైనప్పుడు
నీ ప్రతిబింబమే నేనైనప్పుడు
భూతలంపై పాదమెక్కడ మోపినా
పేగు బంధం కలిపే ఉంచుతుందని మరిచావా
మనమధ్య ముళ్లకంచెలేల చెప్పు
నీవో అలుపెరుగని యోధవని
నాకు తెలుసు.
నా చిన్న గెలుపు వసంతానికై
నీ గుండె గుమ్మానికి ప్రమిదలు వెలిగించే
ప్రకాశానివి
ఏ గుబులు చీకట్లు నిన్ను అలుముకున్నాయో
అవి శ్రావణ మేఘాల కుమ్మరింతలో
కొట్టుకుపోవాలి.
అమ్మా నీవో మలయ సమీరం
నా ఉషోదయపు పసిడి కిరణాల సంతకం
నా ఆంతర్య సమూహానివి
నా జీవిత సమస్తానివి

చీకటి గుహలో పొంచిన
నా కోసం వెలుతురు దుప్పటి పరిచి
కలల సముద్రంలో
అలలపై తేలియాడావ్ కదూ.
సూదుల్లా పొడిచే నిదుర కళ్ళతో
ఎన్ని వేల రాత్రులను పగళ్ళను
రాగరంజితం చేసి అందించావో
నీ కోరికల మెత్తటి తివాచీపై
నా నునులేత పాదాల
అడుగులు వేయించావ్.
తప్పటడుగులు మొదలు
వెన్ను నిటారు చేసేదాకా
కోరలు చాచిన
ముసుగు ముఖాల మకిలిని
వేయి చేతులై తుడిచిపెట్టే కాళికవు
నన్ను కనిపెట్టుకునే దీపశిఖవు.
నీవు చూపిన దారుల్లో
నీవు చూపిన మార్గంలో
కొత్తగా అడుగులు
వేయ ప్రయత్నిస్తున్నాను
ఒంటరిగానే.
నీవు పరిచయించిన ప్రపంచంలో

– నస్రీన్ ఖాన్
సెల్: 9652432981



యడవల్లి శైలజకు తృతీయ బహుమతిని ప్రదానం చేస్తున్న సి. పార్థసారథి, ఐఏఎస్ (రి)

### నిలువెత్తు జాతీయ జెండా అమ్మ....

అమ్మ ఒక శిల్పం
ఉలిచేత పట్టి తనను తాను
ఎన్నో రూపాలు చెక్కుకుంటుందేమో!
ప్రతిరూపంలోనూ ప్రేమ త్యాగం ధైర్యం నింపుకొని
నిలువెత్తు జాతీయ జెండాలా నిలబడుతుంది.
పచ్చని బంగారం రంగు అమ్మ
కట్టెల పొయ్యి దగ్గర మా కోసం వండి..... వండి
పంట చేలల్లో పనిచేసి.... చేసి
ఒళ్లంతా నల్ల బంగారమయ్యింది.
ఎండలో వరి పొలంలో కలుపు తీయడానికి
అమ్మ హరివిల్లులా వంగినప్పుడు
ముక్కుకున్న బేసర మాగాణి నీళ్లల్లో
వెండి నెలవంకలా తళుక్కుమని మెరుస్తది.
ఇంకా కాళ్లు, చేతులైతే
ఎర్రగా రక్తమొడుస్తూ పురిటి బిడ్డలా కనపడతయి.
అమ్మ ముఖానికి చెమటలు కూడా అందమే
పల్లెటూరి శ్రమజీవైక సౌందర్యమే!
నడుముకి చీర కొంగు బిగించి
రోట్లో కారం దంచుతున్నప్పుడు
యుద్ధానికి బయలుదేరిన వీర వనితల అగుపడుతది.
ఇసుర్రాయిలో పెసలు, మినుములు, కందులు
బియ్యం గిరిగిరా తిప్పుతుంటే ఆ గాజులు చప్పుడు
ఎద్దుల మెడలో గంటల వినబడతయి.
పూరిపాక సంసారమైనా
ఎర్రమట్టితో ఇల్లు అలికి
నాము ఉండతో చుక్కల ముగ్గులేసి
ఆకాశంలో నక్షత్రాలు నేలపైకి దింపేది మా అమ్మ.
అప్పుడప్పుడు ఆకలికి కన్నీళ్లను తాగినా
చిల్లు పడ్డ తాటాకు ఇంట్లో వానకు తడిసినా
చిరిగిన చీరను కట్టుకున్నా
సీతమ్మోరి కష్టాలు చవిచూసినా
అమ్మ ముఖంలో నవ్వెప్పుడూ చెదరలేదు
నాన్న పైన చిరాకెప్పుడూ చూపలేదు
మా అమ్మ 'యడవల్లి సీతారాములమ్మ'...!

–యడవల్లి శైలజ
సెల్:9394171299

# పత్రికలు, ప్రసార మాధ్యమాలు విశ్వసనీయతను కోల్పోవద్దు

–తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి



దేవులపల్లి అమర్‌ను సత్కరిస్తున్న ప్రెస్ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, ఆచార్య ఎల్లూరి శివారెడ్డి తదితరులు.

హైదరాబాద్, జులై 1: సమాజంలో విశ్వసనీయతను కోల్పోకుండా పత్రికలు, ప్రసార మాధ్యమాలు వ్యవహరించాలని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి సూచించారు. తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో 65 ఏండ్లు దాటిన ప్రఖ్యాత కవులు, ప్రముఖుల స్వీయ జీవిత విశేషాలను ఆవిష్కరింపజేసే **'పరిణతవాణి'** ప్రసంగ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రెస్ అకాడమీ చైర్మన్ పాల్గొని మాట్లాడుతూ.. సామాజిక చింతన, అభ్యుదయ భావాలు కలిగిన వారు ఎక్కువగా పత్రికల్లో పనిచేస్తుంటా రన్నారు. జర్నలిస్టుల సమస్యల సాధన కోసం వర్కింగ్, జర్నలిస్టుల యూనియన్ కృషి చేసిందని, అందులో పాలుపంచుకున్న వారిలో దేవులపల్లి అమర్ ఒకరని అన్నారు. పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి ప్రసంగిస్తూ పరిణతవాని ప్రసంగాలు చేసిన పెద్దల అనుభవాలు నేటి తరానికీ స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం ప్రముఖ పాత్రికేయులు దేవులపల్లి అమర్ 50 ఏండ్ల పత్రికారంగం అనుభవాలను వివరించారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం యూనియన్ వేదికగా రాజీలేని పోరాటం చేశానన్నారు. ప్రముఖ భాషావేత్త డా।। చంద్రశేఖర రెడ్డి, కార్యక్రమ సమన్వయకర్త రామ్మూర్తి పాల్గొన్నారు.



పుస్తక సమీక్ష



# రెండు దేహాలు... ఒక్కటే కవిత్వ విశ్వం..!

"Decades woven in laughter and storm, two souls entwined , defying time's form, friends eternal, in heart's sacred
keep, where roots run deep and promises leap"

నేటి ప్రస్తుత స్వార్థ సమాజం లో చాలా సందర్భాల్లో స్నేహమనే మాటకు అవసరమనేది మోడ్రన్ మీనింగ్. ఇలాంటి పరిస్థితుల్లో.. ఐదు దశాబ్దాలకు పైగా భావోద్వేగాల జీవిత ఆటలో.. విధి నడిపించే వింత వేటలో.. కాలం చిరునామాపై కలిసి ఉంటూ... నేటి ఆధునిక తరానికి స్నేహ తత్వాన్ని/శాస్త్రాన్ని...కవిత్వంగా మార్చిన

ఆ ఇద్దరు.. కాదు కాదు.. ఒక్కరే..! వి.పి. చందన్ రావు (కందాళై రాఘవాచార్య)..!!. ఏకధార, చందనాగ్నిగా విన్నూ తనమైన చిక్కని కవిత్వ వెన్నెలను తెలుగు సాహిత్యంలో కురిపించిన ఈ ఇద్దరు మిత్రుల కలం నుంచి జాలువారి... నవ్య శోభతో వెలు వడిన ఓ పుస్తక స్నేహం.. ఓ స్నేహ పుస్తకం.. రెండు దేహాలు కలిసి సృష్టించిన ఒక అక్షర శతక గెలాక్సీ "రెండు ఒకట్లు"..!

ఎప్పుడూ ఒకరి నయనానికి ఒకరు రెప్పగా ఒకరి పయనానికి ఒకరు రేవుగా రేకులు విప్పు కోవడం కలిసి రెక్కలు దులిపి ఎగ రడం సహజీవన సౌభాగ్యమంటూ సముద్రోపనిషత్... ఆరంభంలోనే ఉపదేశించారు. ఏ బంధం తాలూ కు పరిమళంలోనైనా ఇంతకు మించిన జీవిత పాఠం ఏముం టుంది..! కలిసి ఉండాలనే సంకల్పం ఉంటే... కష్టకాలం కూడా ఏమీ చేయలేక కనుమరుగై పారిపోతుంది. ఖాళీ కడుపుకి, కాలే కడుపుకి ఎక్స్ రే కావాలం టూ కవిత్వ 'కరపత్రం' సృష్టిం చారు. కరపత్రానికి వెయ్యి కాళ్ళు తగిలించి అది ఋజువు వైపు నడిపించేలా పరిగెత్తించారు. జ్ఞానామృతాన్ని ప్రవచిస్తూ కూలిన విజ్ఞాన మేరు పర్వతం.. అబ్దుల్ కలాం గారిని భవిష్యత్ తరాలకు ప్రేరణ ఇచ్చేలా పరమ యోగిలా కీర్తించారు.

మేం డెబ్బై దాటినా
మా స్నేహం 50 దాటినా

మా మనసులు పైలా పచ్చీసే మా మనసులు సదా పాతికేళ్లే కవిత్వమే మా స్నేహానికి ఆది- పునాదంటూ స్వర్ణోత్సవ వేళ సత్య వాక్యాన్ని కవి గుండెలు పలుకుతుంటే... అది మళ్ళీ మళ్ళీ వింటూ.. ఆనందిస్తూ.. వారిద్దరి స్నేహాన్ని అభినందించకుండా ఎలా ఉండగలం చెప్పండి..!! కవిత్వం అంటే మేం కరిగిపోతాం. కవిత్వం ఉంటే ఎక్కడికైనా పోతాం. మంచి కవిత్వమే మా చిరునామా అని జంట జీవన కవిత్వాన్ని మనకు అందిస్తుంటే.. ఇరు గుండెలు కలిపి పచ్చగా అల్లుకున్న తెలుగక్షరాల స్నేహానికి





–ప్రతులకు: కందాళై రాఘవాచార్య
8790593638

పాఠకులు రెండు చేతులెత్తి సంస్కారంతో నమస్కరిం చాల్సిందే..!

ఏ అపార్ట్మెంట్ ఏ చెరువు సమాధో..! అన్న వాక్యంలో ఎంత దీర్ఘ కవిత్వం ఉందో మనమంతా ఆలోచించాలి.

సమాజంలో అణ చివేయబడుతున్న కొన్ని సత్యాల ను.. బలమైన అక్షరాలుగా చెప్పడం ఈ కవులకే చెల్లింది. నాగలిపై లోకం కన్నీటి వానగా కురుస్తుంటే, పంట భూమి మరు భూమిగా శోకిస్తుంటే రాజరికం ఎన్నికల్లో ఊరేగుతుందంటారు.

చాట్ భండార్ కు పోయినా.. ప్రార్థనాలయానికి పోయినా.. లుంబినీ పార్కుకు పోయి నా... రాజధాని రాక్షసులమయమైం దనీ.. ఇక్కడ బాణాలు పని చేయక,అంతా బాంబుల మయం (మాయం) అనీ ఆవేదన చెందు తున్నారు. లొల్లి లొల్లి నగరంలో జీవితమంతా 'బొగ్గు గీతల' మౌనయాత్రలుగా వ్యక్తపరుస్తు న్నారు.

నిత్య కవిత విరచిత కవిరాజు అభినవ త్యాగరాజు సాహితీ లోకాన రారాజు మా సినారె

ఈ శతాబ్దపు మట్టిలో తొలి దశాబ్దపు మొక్కగా పుట్టి విప్లవా లను పల్లవించిన అగ్ని వృక్షం శ్రీ శ్రీ పోయాడా!! మహా ప్రవక్త శ్రీ శ్రీ పోయాడా!!

ఇలాంటి పదునైన భావజా లంతో కూడిన కవితామయ వాక్యాలతో మహాకవులకు నివాళులర్పించారు. కాలాన్ని పన్నెండు ముక్కలు చేసి క్యాలెండర్ కు నవజీవం పోశారు. వసంతంతో సహా చెట్టును చెట్టుతో సహా కోయిలను సంతలో అమ్ముకునే వాళ్లను, వ్యాపారాన్ని నమ్ముకునే వాళ్లను ఓ ఆట ఆడించారు. వానలు పడి పడి నీటి గనులు ఏర్పడితేనే ధాన్యపు మేడలు కనిపిస్తాయని గట్టిగానే వినిపి స్తున్నారు. సుద్ద ముక్క-నల్లబల్ల మధ్య సంబంధానికి జ్ఞాన శాసనాన్ని లిఖించారు.

100 అందమైన కవితా కుసుమాలతో అల్లిన ఈ పుస్తక దండతో.. చిన్న చిన్న పదాలతోనే సందేశాత్మక సాహిత్యం అందించారు. ఇద్దరూ ఒక్కరై..

ఒక్కరూ ఇద్దరై...మానవత్వ జాతీయ జెండాను కవిత్వ పునాదులపై ఎగరవేశారు. చరమ గీతం, క్రాసింగ్ ప్రాబ్లం, మాతృబోధిని, అడవి కల, కాళోజీ చూపు డు వేలు, ఓడిన ప్రజలు, అనాథ పర్వం, చినుకుల జ్ఞాపికలు, శాంతిగా కురుస్తోంది, అజంతా నక్షత్రం ఇలాంటి ఎన్నో విభిన్న శీర్షికలతో రాసిన కవితలు పాఠకులను ఆలోచింపచేస్తాయి.

ఐదు దశాబ్దాల స్నేహ సారాన్ని "రెండు ఒక్కట్లు" చేసి.. పాఠకు లకు హృదయాల్లో అనుభవ గీతమై పాడుతారు. నిజామాబాద్ కవుల పదాలను తెలుగు కవిత్వం లో చిరస్థాయిగా నిలుపుతారు. మన జంట కవుల స్నేహ స్వర్ణోత్సవ కవిత విపంచిక ప్రస్థానం ఇంకా ముందుకు సాగుతూ ఇం కా ఎన్నో పుస్తకాలుగా.. మన ము ందుకు రావాలనీ మనస్ఫూర్తిగా ఆకాంక్షి స్తున్నాను.

ఈ పుస్తకం స్నేహానికో చిహ్నం.

ఈ పుస్తకం నేటి సమాజ ఓ చిత్రరూపం.

ఈ పుస్తకం ఓ నూతన కవిత్వం.



–ఫిజిక్స్ అరుణ్ కుమార్
9394749536

# 'రెప్పలు దాటని లోకం' పుస్తకావిష్కరణ



'రెప్పలు దాటని లోకం' కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న డా।।కె.వి.రమణాచారి.

హైదరాబాద్, జులై 1: గోపీ రాసిన **'రెప్పలు దాటని లోకం'** కవితా సంపుటిలో లోకం పోకడలు రెప్పల్ని దాటి పాఠకులు చూపారని ప్రభుత్వ పూర్వ సలహాదారుడు, రిటైర్డ్ ఐఏఎస్ డా।।కె.వి.రమణాచారి అన్నారు. రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో గురువారం భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కిన్నెర థియేటర్స్ నిర్వహణలో ప్రఖ్యాత కవి డాక్టర్ ఎన్.గోపి రచించిన 'రెప్పలు దాటని లోకం' కవితా సంపుటి ఆవిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా డాక్టర్ కె.వి.రమణాచారి విచ్చేసి సంపుటిని ఆవిష్కరించి మాట్లాడుతూ గోపి భాషా పాండిత్య ప్రజ్ఞ ఉన్నా ఆయన సామాన్య పాఠకుల్ని దృష్టిలో ఉంచుకొని కవితలు రాస్తారన్నారు.

శైలీ సులభమే కానీ భావం గాంభీర్యంగా ఆలోచనలు రెకెత్తిస్తుందని అని తెలిపారు. ఈ కార్యక్రమానికి సభా అధ్యక్షుడిగా సాహితీవేత్త డాక్టర్ ఎస్.రఘు, తెలుగు విశ్వవిద్యాలయ ఉపకులపతి నిత్యానందరావు, వంశీధర్, ఆచార్య ఎన్.గోపి తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ నిర్వాహకుడు ముద్దాళి రఘురాం తదితరులు పాల్గొన్నారు.



# ఆకట్టుకునే కథలు

కథలు ఎలా పుడతాయి?

అనుభవాల్లోంచి పుడతాయి


ఆ అనుభవాలు రచయితవి అయి ఉండొచ్చు లేదా బయటి ప్రపంచంలో రచయిత గమనించినవి అయి ఉండొచ్చు. కథకుడు తన ఊహా ప్రపంచంలోని పాత్రల్ని దింపి, అవి వేర్వేరు సందర్భాల్లో ఎలా ప్రవర్తిస్తాయి అని చెప్పటం కూడా కావచ్చును. రచయిత పరిపక్వతను బట్టి కథలు పండుతాయి. అందుకే అందరూ కథలు రాసినా రాస్తున్నా, పాఠకుడు కొందరి కథలనే ఇష్టపడుతాడు.

డా॥ దాడి వీరగౌరీ శంకర రావు (డా॥ డివిజి శంకర రావు) కథలు చదుతోంటే.. పాఠకుడు **"బాగా రాసాడే"** అన్న కంక్లూజన్‌కు వస్తాడు.

**"డి.వి.జి. కథలు"** కథా సంపుటిలో 50 కథలున్నాయి. కథలన్నీ, అందంగా తీర్చి దిద్దిన ఉద్యానవనంలోని మొక్కల్లా ముచ్చట గొలుపుతాయి. 3 లేదా 4 పేజీల్లో ముగుస్తాయి. పాత్రలు సంఘటనలు, మలిచిన తీరు- అన్నీ, రచయిత ఒక కుటుంబంలోని తండ్రిగానో, భర్తగానో, కొడుకుగానో చెబుతున్నంత 'దగ్గరితనం' ఉంటుంది. పాఠకుడు ఒక పరిచయం ఉన్న మిత్రుడి ఇంట్లోకి ప్రవేశించి, ఆ కుటుంబంలో భాగమై కథను అనుభూతిస్తున్నట్లుగా ఉంటుంది. అనుభవంలోకి వచ్చిన సంఘటనల **'పేరుపు'.** కనుక సగటు మనిషి జీవిత చిత్రణలా ముచ్చట గొలుపుతాయి. ఒక్కోచోట కథ ముగింపు కొస మెరుపుతో తళుక్కు మంటాయి.

**'డి.వి.జి కథలు'** శంకర రావుగారి మొట్ట మొదటి కథా సంపుటి. లోగడ వీరు 'డి.వి.జి. కవితలు' ప్రచురించారు. సుమారు అయిదు వేలకు పైగా ప్రజా సమస్యలపై లేఖలు వ్యాసాలు వ్రాసారు. ఒక టర్మ్ లోక్ సభకు ఎన్నిక కాబడ్డారు. ప్రజల మధ్యనే ఉంటూ, ప్రజల సమస్యలపై అవగాహన పెంచుకున్న వారు కనుక ఈ కథలు అన్నీ వ్యక్తిగత సంబంధాలకు ప్రతీకలు. అన్ని కథల్లోనూ కనిపించే శైలి. అభివ్యక్తి కుటుంబ సంబంధాల వివరణ వల్ల.. ఇవన్నీ వారి జీవితానుభవాలే అనిపించేంత సహజంగా వివరించబడ్డాయి. ఒక్కోచోట కథల్లో తన కుటుంబ వ్యక్తుల పేర్లు ఉపయోగించటం వల్ల సహజత్వానికి దగ్గరగా ఉన్న అనుభూతి పాఠకులకు కలిగిస్తారు.

మనల్ని మనం మన్మధుడిలా ఊహించుకుంటాము. యవ్వనపు తొలిరోజుల్లో కాలేజీ జీవితంలో కనిపించిన ప్రతి అమ్మాయిలోనూ ఏదో ప్రత్యేకత కనిపిస్తుంది. అమ్మాయిలందరినీ ప్రేమిస్తాము **'ఐ లవ్యూ'** చెబుతాము. అలా 'ఐలవ్యూ' చెప్పిన అందగాడికి క్లాస్‌మేట్ స్వర్ణ ఓ అద్దం బహూకరిస్తుంది. 'మీరెప్పుడూ మీ ముఖాన్ని అద్దంలో చూసి ఉండరు' అని. తర్వాతి కాలంలో ఆ అద్దం అతని జీవితంలో ఓ భాగమవుతుంది. నిజాన్నే చెబుతూ ఉంటుంది ఆ 'స్వర్ణ దర్పణం'. నిజానికి నిజాలన్నీ మోయలేని బరువులు. అందుకే కాబోలు ఆ అద్దం పగిలిన





**ప్రతులకు:**
డా॥డి.వి.జి. శంకర రావు
50, కామాక్షినగర్
విజయనగరం-535 003.
ఆంధ్రప్రదేశ్.
సెల్: 9440836931

నాడు ఆయన భార్యకూతురు సంతోషిస్తారు. సంచికలోని మొదటి కథ, రచయిత మొదటి కథ...యదార్థం గమనించమనే..'అద్దం'.

పొలమైనా, రానున్న తరమైనా, మంచి వారి చేతిలో ఉంటేనే రాణిస్తాయి. మంచి ఫలితాన్ని ఇస్తాయని చెప్పే కథ 'ఫలితం'. పరీక్షలు పేనవటం కన్నా, డిగ్రీలు సంపాదించటం కన్నా ఆపదలో ఉన్న మనిషి ప్రాణాలు నిలపటం గొప్ప అని ఈ కథ చెబుతుంది.

'పుట్టిన్నాటి బుద్ధి పుడకల్తో కూడా పోదు" అంటారు. ఇది నిజమేనంటారు శంకర రావు గారు. డా॥ గణపతి ఇప్పుడు అమెరికాలోని పేరు మోసిన కార్డియాలజిస్టు. 20 సంవత్సరాల తర్వాత ఇండియాకు వస్తున్నారు. ఓ సదస్సులో ప్రసంగిచటానికి. విశాఖలో ప్రసంగం. బస ఓ గొప్ప హోటల్లో. హోటల్లో ఉండగా, తన స్వంతూరు, క్లాసుమేటు తన బాగు మాత్రమే చూసుకునే నీలకంఠం వస్తాడు. స్వంత ఊరులో. సన్మానం అంటే సంతోషించి సరేనంటాడు. ప్రయాణమై, ఊరి పొలిమేరన తన సన్మానం గురించి ఊరి పొలిమేరలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ చూసి వెనుదిరుగుతాడు. కారణం- నీలకంఠం ఏర్పాటు చేసిన సన్మాన చేస్తున్నది ఊరి వారు కాదు. అదో కుల సంఘం! అక్కడా, నీలకంఠం కుళ్ళు బుద్ధి.. గమనించిన మనమూ అసహ్యపడతాము 'ప్రయాణం' కథ చదివి. ఇది శంకరరావు వ్రాసిన రెండో కథ. రచయిత విశాల దృక్పథానికి జోహారు.

కారు కొనాలని మామయ్య. ఈ వయసులో వీరు డ్రయివు చేయను లేరు కారెందుకు అని అల్లుడు. కారు కొన్నాక ఒక్క సారైనా స్టీరింగ్ పట్టుకోమని మామయ్య. ససేమిరా అన్న అల్లుడు. చివరకు మామయ్య కారును అల్లుడు డ్రయివు చేస్తున్నాడు. వెనక సీట్లో మామయ్య నిశ్చింతగా కూర్చున్నాడు. మామయ్యే గెలిచాడు. ఇద్దరి మధ్య మౌనం. వెనక సీట్లో మౌనంగా నిశ్చింతగా తనే గెలిచిన సంతోషంతో మామయ్య కూర్చున్నాడు. 'అస్థికల' రూపంలో!

ఈ కొసమలుపు కథ. చివరి వాక్యం వరకూ సస్పెన్సు పాటించి చివరి వాక్యంతో పాఠకులను కుదేలు చేస్తుంది 'పంతం' కథ.

వృత్తిరీత్యా ఎం.డి (అనస్థీషియా) ప్రొఫెసర్ మరియు హెడ్‌గా కళాశాల బాధ్యతల నిర్వహణలో రావుగారు ఎన్నో కథలు వైద్య వృత్తిలో వ్రాయగలరు. అలాంటి కథ 'దైవం'.. అందునా. మానవత్వం వేళవించబడింది. మరణశయ్య మీద చేతనకు అచేతనకు ఇటూ ఇటూగా పయనిస్తోన్న రోగి

> **ఆ అనుభవాలు రచయితవి అయి ఉండొచ్చు లేదా బయటి ప్రపంచంలో రచయిత గమనించినవి అయి ఉండొచ్చు. కథకుడు తన ఊహా ప్రపంచంలోని పాత్రల్ని దింపి, అవి వేర్వేరు సందర్భాల్లో ఎలా ప్రవర్తిస్తాయి అని చెప్పటం కూడా కావచ్చును. రచయిత పరిపక్వతను బట్టి కథలు పండుతాయి. అందుకే అందరూ కథలు రాసినా రాస్తున్నా, పాఠకుడు కొందరి కథలనే ఇష్టపడుతాడు.**

లయకారుడైన శివుడిని ఒక్క రోజు ఆరోగ్యం కోరుకుంటాడే. కారణం కొడుకు పేరున వ్రాసిన ఫేక్టరీ ఆస్తులను ఉద్యోగులకు సామాజిక సేవలకు తిరిగి రాయాలని.

పల్లెటూరు పట్నవాసం- రెంటినీ బాగా ఎదుగుదురు ఈ రచయిత. పొట్టకు వచ్చిన వరి చేలు **"గాలికి తల ఊపుతూ కళ్ళు మూసుకుని కునుకు తీస్తున్నద"**ట. ఇక్కడి (పట్నవాసపు) మిరిమిట్లు గొలిపే లైట్లుకన్నా, ఊరిలో మినుకుమనే గుడ్డి దీపాలే వెయ్యిరెట్లు "అందం" అంటారు. **"రైతు బిడ్డ"** కథలో. ఈ కథలోనే మరో స్టేట్‌మెంటు **"మొక్కని మట్టిని ప్రేమించండి. మీకు వయసు అలసటా గుర్తుకు రావు"** అంటారు. రైతును అతి దగ్గరగా పరిశీలిస్తేనే కాని వ్రాయలేని వాక్యాలు!

కరోనా కష్టకాలంలో అందరు రచయితల్లాగే శంకరరావు గారూ కథలు అల్లారు. పాజిటివ్ దృక్పథం కనిపిస్తుంది "కరోనా రూపేణా" కథ. నేటి కాలంలో కృత్రిమ మేధ (A1) మర మనుషులు (రోబోలు) కథా వస్తువులవుతున్నాయి (రోబో. 3.0. కథ) ఇక్కడ కూడా యం.సి.ఓ.సి.లు వస్తున్నాయట! యం.సి. అంటూ మన కేస్ట్! 'నిజం' 'పంకజం' 'ప్రేమకానుక' కథలలో హాస్యం కూడా పండించారు. ఎవరు బాగుపడినా ఫరవాలేదు. కాని తెలిసిన వారు బాగుపడితే మనసుకెంత కష్టమో! (దేశమంటే-కథ). కుటుంబ ప్రాణి. సామాజిక జంతువు కాదు (దగ్గరగా.. దూరంగా.. కథ) లాంటి 'సెటైరు'లు పాఠకుడికి చదవటంలోని శ్రమను అనాయాసం చేస్తాయి. 50 కథలనిండా, ఇలాంటి మంచి మంచి వాక్యాలు కొల్లలు!

వైద్య జ్ఞానం, అధ్యయానానుభవం, ఒక ఎం.పి.గా ప్రజల మనఃస్తత్వం, Close-knit కుటుంబం. వెరసి ఈ ఉత్తరాంధ్ర ప్రముఖ రయిత గంటేడ గౌరునాయుడు తన ముందుమాటలో చెప్పినట్లు. కథను ప్రేమగా దగ్గరకు తీసుకుని కథను (పాఠకునికి) దగ్గరగా చేయటమే కాకుండా కథకొక సామాజిక ప్రయోజనం కల్పించారు డి.వి.జి. శంకర రావు. సహృదయత, భావుకత సంస్కారము కథల నిండా పరుచుకుని కథలకొక ప్రత్యేకతనిచ్చాయి"- అక్షరాలా నిజం!




**- కూర చిదంబరం**
సెల్:8639338675

**పుస్తక సమీక్షలు**

# అరాచక వ్యవస్థను నిలదీసే ప్రశ్న- కవితా సంపుటి

శ్రమే జీవనం, సర్వస్వం. శ్రమను దోచుకొనే మనిషి మనిషే కాదు. స్వశక్తిని నమ్మి, శ్రమించి బతికే విశ్వనరులకు అంకితం యిచ్చిన 'బంగారు వి.బి. ఆచార్యులు' కవితా సంపుటి **'ప్రశ్న'** వామపక్ష భావజాల చైతన్యంతో సమాజ అభ్యుదయాన్ని ఆకాంక్షిస్తుంది. ఈ సంపుటిలో తొలి కవిత 'ప్రశ్న'లో ప్రశ్నించటం బాంబులా సంధిస్తే, అది పేలి నిజం ఊపిరాడక తన్నుకొస్తుంది అంటారు. వర్తమాన పరిస్థితులపై ప్రగతిశీల ఉద్యమ దృక్పథంతో స్పందించిన కవితలు ఈ సంపుటిలో ఉన్నాయి. **'తుది విజేత'**లో అరకు భుజాన్నేసుకొని నల్లచట్టాలపై




ప్రతులకు: బంగారు వి.బి. ఆచార్యులు, అరసం ఏలూరు జిల్లా శాఖ ప్రచురణ
సెల్: 98495 79569

పోరాడే రైతు, పెద్దనోట్ల రద్దుతో నలుపు తెలుపైన **'గప్‌చుప్' గోపురాల్ని పక్కన పెట్టి పిల్లల్ని బడిబాట పట్టిద్దాం'** అనే విశ్వనరుడు, 'పిట్టల దొర'ల ఆట కట్టించే ఆయుధం ఓటు, కీచక వ్యవస్థపై **'అబలలమే'**, కార్పొరేట్‌ల **'పప్పెట్లు'**గా రాజకీయ పార్టీలు, యుద్ధం ఉన్మాదం అనే **'ప్రపంచ శాంతి', మార్క్స్ నీకు లాల్ సలామ్'**, **"నోరుండి తెరవలేని గొంతుకలెందుకు? పిడికిలి బిగించలేని చేతులెందుకు"** అంటూ కవి బంగారు విబి ఆచార్యులు సూటిగా కవితా పరంగా ప్రశ్నిస్తారు.

**'ఏమౌతుంది దేశం'**లో ప్రశ్నిస్తే జవాబొస్తుందా? పిడి యాక్ట్ రెడీ అవుతుందా తేల్చుకోమంటారు. **'తిరోగామి భారతం'** ప్రపంచ పటంలో వెలిగిపోతోంది అంటారు.

ఈ సంపుటిలో మరొక అధ్యాయం లఘువులులో మినీ కవితలు 42 ఉన్నాయి "కుల మత ప్రాంతీయ భావాల కతీతం స్నేహం అవే దురహంకారాలు సమాజ వినాశకాలు" అంటారు.

ప్రశ్న జ్ఞానానికి, వికాసానికి మూలం. సూటిగా, నిర్భయంగా, సరళంగా అర్థమయ్యే తేలిక పదాలతో, భాషా పటాటోపం లేకుండా ప్రశ్న కవిత్వం ద్వారా నిలదీస్తోంది.



**-జయసూర్య**
9440664610


# శతకమొకటి చదువ సంస్కారమబ్బును

తెలంగాణ ఆధునిక పద్య కవితా వికాసానికి దోహదం చేస్తున్న వాటిలో ఇతిహాస, పురాణ, కావ్య ప్రబంధాలకన్నా శతకమే ప్రప్రథమ స్థానంలో ఉందనాలి. నిజం చెప్పాలంటే తెలుగు పద్య కవితామ తల్లికి ఆధునిక శతకం మకుటం పెట్టి సాహిత్య సామ్రాజ్యానికి పట్టమహిషిని చేసింది.

పద్యం వ్రాయాలనుకొని సాధన చేస్తున్న ప్రతి ఒక్కరు ఒకటి రెండు శతకాలు ప్రచురిస్తూనే ఉన్నారు. రచనా శిల్పం తెలిసిన వారైతే శతకం ద్వారా బంగారం పండిస్తున్నారు. అంటే తమ శతకాల్లో మానవతా మూల్యాలు, నైతిక విలువలు, ఉపకారం-దయ- శాంతి- అహింస-ప్రేమ-సహాయం మొదలైన సద్గుణాలు ప్రచారం చేస్తూ సద్గురువుల్లా శతక కర్తలు కనిపిస్తున్నారు.

**పత్రికొక్కటున్న పదివేల సైన్యంబు**
**పత్రికొక్కటున్న మిత్రకోటి**
**ప్రజకు రక్షలేదు పత్రిక లేకున్న**
**నవయుగాల బాట నార్ల మాట.**

> **పద్యం వ్రాయాలనుకొని సాధన చేస్తున్న ప్రతి ఒక్కరు ఒకటి రెండు శతకాలు ప్రచురిస్తూనే ఉన్నారు. రచనా శిల్పం తెలిసిన వారైతే శతకం ద్వారా బంగారం పండిస్తున్నారు. అంటే తమ శతకాల్లో మానవతా మూల్యాలు, నైతిక విలువలు, ఉపకారం-దయ- శాంతి- అహింస-ప్రేమ-సహాయం మొదలైన సద్గుణాలు ప్రచారం చేస్తూ సద్గురువుల్లా శతక కర్తలు కనిపిస్తున్నారు.**




ప్రతులకు: సముద్రాల శ్రీదేవి
ఫ్లాట్ నెం.102, ఇ.నెం. 4-84/1,
విజయనివాస్ అపార్టుమెంట్
దుర్గానగర్, దిల్‌సుఖ్‌నగర్
రంగారెడ్డి జిల్లా. హైదరాబాద్
సెల్: 99498 37743

పశువుగా, బండగా, మొండి గా మారుతున్న మనిషిని సాంస్కృతిక మానవునిగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తూ తమ సామాజిక బాధ్యతను నిర్వర్తిస్తున్నారు. వృష్ఠి-సమిష్ఠి-సృష్ఠి-పరమేష్ఠి వరకు (తన నుండి విశాల విశ్వ పుటంచుల వరకు) ఇలా ఉంటే బాగుంటుందని ఆప్త-తప్త హృదయాలతో అక్షరాల్లో తమ అంతరంగాల్ని ఆవిష్కరిస్తున్నారు.

పద్యకవిత, గేయ కవిత, వచన కవిత ప్రక్రియ యేదైనా కానీ నిహిత స్వార్థం (వేస్టెడ్ ఇంట్రెస్ట్) లేని ఆధునిక కవిపై ప్రబోధాలతో అక్షరాలను శిల్పీకరిస్తున్నాడు. అందరిలో తనను తనలో అందరినీ చూచుకోవాలనే ఏకాత్మభావనా ప్రపంచం వైపు పయనిస్తున్నాడు.

ఈ కోవకు చెందిన రచయిత్రి (కవయిత్రి) శ్రీమతి సముద్రాల శ్రీదేవి గారు వచన కవితా సంపుటాలు ప్రచురించి పేరు తెచ్చుకున్నారు. వినూత్న పద బంధాల్ని ప్రతీకల్ని, శిల్పీకరించి వచన కవితా శిల్పం తెలిసిన వారుగా కీర్తి గడించారు.

ఇప్పుడు దేవి మాట శతకాన్ని ప్రచురిస్తున్నారు. నార్లమాట, ముద్దు మాట, చిట్టి మాట, నేటి మాట, రెడ్డి మాట వంటి శతకాలు, ఇంకా మాట పేరుతో ఇలాంటివే ఈ అర్ధ శతాబ్దంలో ఎన్నో వచ్చాయి. బాగా ప్రఖ్యాతి గాంచిన నార్ల వారి శతకం.

గత శతాబ్దాన్ని కథ-నవల శాసించిందని, ఈ శతాబ్దాన్ని (ఇరవయ్యొకటవ) పత్రిక శాసిస్తున్నదని అందుకే ఇది పత్రికల యుగంగా భావించారని, ఈ నేపద్యం నార్లవారిపై పద్యం వెనుక ఉన్నదని విజ్ఞులంటారు.

పైన నేను పేర్కొన్న నేటి మాట, చిట్టి మాట, రెడ్డి మాట వంటి శతకాల రచయితలు వేమిలా మకుటం పెట్టుకోవ డానికి నార్ల శతకమే కారణమ

**సముద్రాల శ్రీదేవి రచించిన "దేవి మాట శతకం' పుస్తకానికి డా॥ కసిరెడ్డి వెంకటరెడ్డి రాసిన ముందుమాట**

న్నారు. ఎవరి మాట వారిది, అది అనుసృజనమే కాని అనుకరణం కాదు. దేవి గారి మాట దేవి గారిది వారు మొదటి పద్యంలోనే **'ధారగల్గు పద్య సారమే యమృతము'** అన్నారు. దివ్యమైన బాట దేవిమాట అనే మకుటంతో దివ్యంగా శతకాన్ని పూర్తి చేశారు.

దివ్యం అనే పదానికి దివికి సంబంధించింది అని, దేవతలు అనీ, ఒకరికి ఇచ్చేవారనీ, సత్య మనీ, బాస అనీ, ఆకాశం అనీ చందనం అనీ గంగాజలం అనే దివిలో పుట్టినదనీ, శ్రేష్టమైనదనీ ఇలా అనేకార్థాలు ఉన్నాయి. దివ్య వాని అంటే ఆకాశవాణి- దేవతలవాణి అని అర్థం. ఎట్లాగూ వారి పేరుతో దేవి ఉన్నది. పైగా శ్రీదేవి. రెండు దేవతా సంబంధమైనవే. మొత్తం మీద దేవి మాట అంటే రచయిత్రి మాట, దివ్యమైన బాట అంటే మంచి మార్గాన్ని చూపించేది అని అర్థం చేసుకోవాలి.

వేమన మొదలు పెట్టిన ఆట వెలది పద్యాలు, ఎందరికో మార్గదర్శనం చేశాయి. రాగ యుక్తంగా ఉండడం, ప్రౌఢ సమాసపద గుంఫనకు అనుకూలంగా లేకపోవడం, భావాన్ని లలిత మనోహరంగా చెప్పడానికి వీలుగా ఉండడం, దేశీ ఛందస్సు లో ఇది మీదే మీ అందరిదే (నాదే-మాదే) అనే ఆత్మీయతను కనిపింప చేసి అలరించే గుణం కలిగి ఉండడం.. ఇన్ని సుగుణాల కారణంగా ఆటవెలది (పద్యం) అందరి మనస్సులలో నిలిచి పోయింది.

ఆట వెలదిని కొద్దిగా మార్పు చేసి ఇది పాట వెలది అన్నాడో ఆధునిక కవి.

**కవిత గుండె కనుల గాంచంగ వలయును**
**గానమును మనంబు నూని వినుము**
**కవిత గానకళలు కనులు వాగ్దేవికి**
**దివ్యమైన బాట దేవి మాట (6)**

ఇప్పుడు మనం చెప్పుకొన్న గుణాలన్నీ ఈ పద్యంలో ఇమిడి ఉన్నాయి. కవిత అంటే సాహిత్యం, గాన కళలు అంటే సంగీతం ఈ రెండూ సరస్వతీ అమ్మవారికి నయనాలు.

ఈ మధ్యకాలంలో "సంగీత మపి సాహిత్యం సరస్వతాః చక్షుద్వయమ్.. అని కొద్ది మార్పు చేసి చెప్పుకొంటున్న శ్లోక పాదం వివరణే పై పద్యం.

**చదువు సారమెరిగి చదువగా వలయును**
**తీరు తీరు రుచుల తినెడి యట్లు**
**సారహీనమైన చదువులు వ్యర్థము**
**దివ్యమైన బాట దేవిమాట (10)**

తాము చెబుతున్న ఈ శతక పద్యాల అర్థాలన్నీ రచయిత్రి చెప్పకనే చెప్పి నట్టయింది. వేమన మూడో పాదంలో 'సారం' ఉన్న ట్లే శ్రీదేవి గారి ఆటవెలదుల్లోనూ సామాజిక సారస్వరసారం కనిపిస్తుంది. కొన్ని చూడండి.

మాతృభాష పట్ల మమతను వీడకు (4)

అనుభవమున నందు మానందలోకాలు (7)

ఉన్నయన్ని వాళ్ళ ఉపకరించినచాలు (18)

తప్పుజేయనేల ముప్పుబడయనేల (23)

కంటనీరు తుడుచుగద మిత్రుడొక్కడే! (38)

పెద్దలన్నమాట వద్దనబోకుము (45)

మనసు గెలుచువాడు మారుని గెలుచును (48)

రైతునాదరింప రామరాజ్యమ్మగు (61)

ఈ విధంగా సామెతల రూపంలో సూక్తి సుధలుగా కనిపిస్తున్న మూడోపాదాలు సర్వకాలీన సర్వజనీన సత్యాల్నీ తెలియజేసున్నాయి.

శ్రీదేవి గారి ఈ శతకం వ్యక్తిత్వ వికాసానికి, మాతృ భాషాభిమానం పెంచడానికి, గుణశీలాల నిర్మాణానికి, నైతిక విలువల పరిరక్షణకు సంస్కారాల నిర్మాణానికి, స్త్రీ గౌరవ ప్రబోధానికి, పురుష కీచకుల నిర్మూలనానికి, మన కుటుంబ జీవన పరిరక్షణకు దోహదం చేసే అనేక అంశాలను ప్రస్తావించింది.

ప్రబోధాత్మక శతకాన్ని అందించినందుకు వారికి అభినందనలు తెలియజేస్తూ దేశభక్తియున్న దేహము ధన్యము (28) అన్న పద్యపాదం సర్వదా స్మరణీయ మని భావిస్తూ, దేశం, ధర్మం, జాతి, సంస్కృతి పరిరక్షణలో వారి సృజనాత్మక సాహిత్యం ఎంతో ఉపయోగపడుతుందని కితాబునిస్తూ సెలవ్.




**-డా॥కసిరెడ్డి వెంకటరెడ్డి**
సెల్:9866956250

# ఒక మంచి అభ్యుదయ రచయిత 'డా॥ ఫణికుమార్'

మతానికీ కులానికీ మరో అర్థం రక్తపాతం, మానవ కల్పితం మాయ, మృత్యుకోర, మనుషులను నడిపించాలి మతం కాకూడదు మారణహోమం. మనసులేని రాతి హృదయాలు మారితే మన దేశం ఆనందమయం. ఇలాంటి మంచి ఆలోచనలతో కూడిన కవితలు ఈ పుస్తకం **'మనిషే చెట్టైతే'**లో కనిపిస్తాయి. ప్రతి కవితలోనూ డా॥ఫణికుమార్ చకిలం కొత్తగా చెప్పేందుకు ప్రయత్నించారు. ఎక్కడా రాజీపడలేదు. అభ్యుదయ భావాలున్న కవిగా చెప్పుకోవాలి. 'డబ్బు' అన్న రచనలో ఇంత చిన్న నాణెంపై ఎన్ని జీవితాలు? ఎంతగా.. నాట్యమాడ్తున్నాయి అంటూ ముగించారు. అద్దమా నీవు అమ్మవా అపర బ్రహ్మవా, ఎంతటి దుర్మార్గాన్నైనా అక్కున చేర్చుకునేది నువ్వే అంటూ అద్దం అనే కవితలో నిజం చెప్పారు. కరడు కట్టిన కాలం తిరిగి కమ్మని అమ్మ కడుపులోకెళ్తే ఎంత బాగుంటుందని అందరి మనసులో వుండే కోర్కెనే బయటపెట్టారు. ఇక పోలీసు బాబాయ్ గురించి కవితరాస్తూ, గడియారం ముళ్ళవెంట 'డ్యూటీ' పరుగులు ప్రతీక్షణం, నిప్పులు జేబుల్లో రగిలే బ్రతుకు, అతనింటికొచ్చిన ప్రతి రోజూ మా పిన్ని తేలిగ్గా ఊపిరి పీల్చి తాళి కళ్ళకద్దుకుంటుంది అని రాసిన మాటలు, సామాన్య పోలీసు వారు ఎంతటి దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్నారో చెప్పకనే చెబుతుంది.

మనిషి చెట్టైతే ఎంత బాగుం దును, ఎందుకంటే వృక్షం ప్రకృతి లో పచ్చదనాన్ని నింపుతుంది, చల్లని గాలిలో మేఘాల్ని సృష్టించి అమృతవర్షం కురిపిస్తుంది. ఎండ తట్టుకుని నీడను, చెడును ఆస్వాదించి మంచిని మనిషికి.. ఆయువవుతుంది అన్న పంక్తుల్లో ఎంతటి మానవతా కోణంలోని ఆంతర్యాన్ని పచ్చదనానికి అద్దారో కదా! నిండైన మనిషి కోసం అన్న కవితలో కులం- మతం-జాతి రంగుల తేడాలు, ఆకలి ఆక్రందనలు, యుద్ధ భీభత్సాలు, పోరాటాలు, ఎన్‌కౌంటర్లు, చరిత్ర పుటల నిండా రక్తధారలు. కాలం కరాళ నృత్యాన్ని ఆపలేదంటూనే, తాను రెండు కాళ్ళపై నిల్చున్న నిండైన మనిషి కొరకు ఎదురు చూస్తున్నాను అన్న కవి హృదయ ఆవేదన అర్థమవుతుంది. జీవితం అన్న కవితలో ఆత్రంగా పరిగెడుతున్న జీవితాలు, అద్దాల సౌధం భళ్ళుమంది, ఒక చరిత్ర పోస్టు మార్టం కెళ్ళింది, ఇలా రోడ్డు రక్తంతో రోజూ హోలీ ఆడుకుంటుంది అంటూ రోడ్డు ప్రమాదాల గురించి రెండు సిరా కన్నీళ్ళురాల్చారు. ఎన్నో సామాజిక సమ స్యలను నిర్భయంగా సంస్కార వంతంగా రాసుకొచ్చిన మన యువకవి డా॥ఫణికుమార్ చకిలం. ఇంకా, ఇంకా వీరి కలం నుండి ఇలాంటి కవితలు ఎన్నో రావాల్సి వుంది.






**ప్రతులకు:** నాగేశ్వరరావు
అడ్వకేటు, సీతారామపురం
మిర్యాలగూడ-508 207
సెల్: 9885797375



**- డా॥ పులివర్తి కృష్ణమూర్తి**
సెల్:9949092761

## బ్రతుకు క్రికెట్

కాలపు బౌలర్ వేసే బంతిని
బతుకు పిచ్‌పై ఎదుర్కోవాలి
కష్టాల బంతులను దాటుకుంటూ
సుఖాల సిక్సర్లు కొట్టాలి
ధర్మం సత్యం ఎంపైర్లుగా
ఇన్నింగ్స్ మొత్తం ఆడాలి
సెంచరీ తీరిన మన గెలుపును
ప్రేక్షక లోకమే మెచ్చాలి.



**-రజిత**
సెల్:7569856191

## మరణం

కథ ముగిసేది చివరికి అక్కడే
అంతస్థుల్లో ఎ.సి.గదుల్లో నిద్రించినా
పూరి గుడిసెలో నేల మీద పడుకొన్నా
రెండింటికీ మరణం ఒక్కటే!
పంచభక్ష్య పరమాన్నాలు భుజించినా
అంబలి తాగి కడుపు నింపుకొన్నా
మరణం రెండిటికీ ఒక్కటే!
కొత్త బట్టలు వేసుకొని కార్లలో తిరిగినా
చింకి బట్టలతో రోడ్ల మీద నడిచినా
పేదరికమైనా- కోటీశ్వరుడికైనా
ఇద్దరికీ మరణం ఒక్కటే!
రోజుకైనా- రైతుకైనా
శ్రమ జీవికైనా-బడాబాబుకైనా
వృద్ధులు- పిల్లలు ఎవరికైనా
మరణం అందరికీ ఒక్కటే
ఏమీ చేయలేని నిస్సహాయులు
వేదనలు రోదనలూ పొంచి ఉన్నా
క్రమంగా మృత్యు చీకట్లు కమ్మాల్సిందే.
దేహం గాయాలపాలైనా
ఓదార్పుల స్వాంతన వచనాలు పలికినా
ఊపిరి నిలుపుకోవాలని తపించినా
క్షతగాత్ర స్థితిలో కూడా
మరణం వచ్చి వాలుతుంది.
నైరాశ్యాన్ని కూడగట్టుకొని
చివరి సారిగా మనసుని
ప్రక్షాళన చేసుకోవాలి.
పిలుపురాగానే వెళ్ళిపోవటానికి
సిద్ధంగా ఉండాలి.



-తాటికోల పద్మావతి
సెల్:9441753376

## ఆది దేవతలు

నేను తీసుకున్న బ్యాంకు లోన్
మిత్రుడి వద్ద తీసుకున్న రుణం
బంధువును అడిగిన నగదు
ఇలాంటి అప్పులన్నీ తీర్చవచ్చు
కాని?
జన్మనిచ్చిన తల్లి పాల రుణం
నాన్న కక్కిన చెమట ధారల రుణం
ఎన్నటికీ తీర్చలేమేమో కదా..!
నీ చర్మంతో చెప్పులు కుట్టించి..
అమ్మనాన్న పాదాలకు తొడిగినా..
తల్లిదండ్రుల రుణం ఎన్నటికీ తీరదు
వారి రుణభారం లెక్కించడానికి..
గణిత అంకెలు అక్కరకురానే రావు !.
అమ్మ లెక్కల్లో ఎప్పుడూ తప్పే..
నేను ఒక రొట్టె అడిగితే..
అమ్మ రెండు మూడు పెడుతుంది
అమ్మ తన ఆకలిని మరిచి..
ఎప్పుడడిగినా ఆకలిగా లేదంటూనే?
నా ఆకలిని అర్థం చేసుకొని..
కొసిరి కొసిరి వడ్డిస్తూ తినిపిస్తూ?
తన ఆకలిని తీర్చుకుంటుంది !.
అమ్మ తన ప్రతి రక్త బిందువును..
రొమ్ముపాల అమృతంగా మార్చింది
నాన్న తన ప్రతి చెమట చుక్కను..
నా భవిష్యత్తుకు పెట్టుబడిగా పెట్టాడు
బిడ్డల్ని ఉన్నత శిఖరంపై నిలపడానికి..
అమ్మనాన్నలు పునాది రాళ్లు అయ్యారు
బేషరతు నిస్వార్థ ప్రేమానుబంధాల..
యాంత్రిక వలయంలో చిక్కి శల్యమై..
నిశ్శబ్దంగా నిష్క్రమిస్తారు అయ్యవ్వలు !.
నాన్న ఎప్పుడూ నిజాలు చెప్పడు..
నవ్వుల వెనుక బాధల్ని దాస్తాడు
అప్పులోళ్లు వెంటాడుతున్నా..
తల తాకట్టు పెట్టైనా క్షణాల్లో..
అడిగిందే తడవుగా డబ్బులిస్తాడు
నాన్న మనసు బండరాయి..
ఎప్పుడూ కన్నీరు పెట్టగా చూడలేదు.
నాన్న మహా పిసినారిగొట్టు..
ఎప్పుడూ కొత్త బట్టలు వేసుకోడు..
తన గూర్చి పూర్తిగా మరిచిపోయి..
బిడ్డల భవిష్యత్తును శ్వాసిస్తాడు !

-మధుపాళీ
9949700037

## ఎవరో

మండే ఎండలు
పూరి గుడిసె..
కరెంటు మాటే లేదు..
చిన్న జాగా,
పెద్ద వేపచెట్టు..
ఎండాకాలం
ఎట్లా వోయిందో తెలువదు...,
రేకుల ఇల్లు,
ఒకటే ఫ్యాను
ముందొక చింతచెట్టు
గాలి ఆడక
నిద్రపట్టదనే చింతనే లేదు..,
పెంకుటిల్లు
పెద్ద వాకిలి..
నిండా చెట్లు
ఉక్కపోతల జాడనే లేదు..,
రాజభవంతి
గదికొక ఏ.సి.,
ఒక్క చెట్టూ లేదు,
ఒళ్ళంతా విసుగులమంటలు
ఎవరికీ సరైన నిద్రల్లేవ్
ఎండల మీద ఎడతెగని కంప్లైంట్లు..
కాలం మీద గెలిచింది ఎవరో..
కాలం పోటీలో నిలిచింది ఎవరో..?



-డాక్టర్ కాసర్ల
9441506252

## నానీలు...

తాటి చెట్టు నీడ
పల్లె జీవన గీతం
ముంజలో దాగుంది
మట్టి పరిమళం.



తాటి ముంజలు
ఎండలకు ఔషధం
ప్రకృతి ప్రసాదించిన
తియ్యని వరం..!

-కొలిపాక శ్రీనివాస్
09866514972.

తాటి ముంజ తీపి
మాటల్లో చెప్పలేం
రుచిస్తే
బాల్యమే పలుకుతుంది.

తాటి కాయలతో
చిన్నప్పటి ఆటలు
మట్టిబాటలో
సంబరాల గుర్తులు.

వేసవి తాపానికి
తాటి ముంజే
చల్లదనం..
ప్రాణానికి హాయి..!



## కవితార్చన

అడ్మిన్: డా॥రాధాకుసుమ
సెల్:99892 41319
"కుసుమ ధర్మన్న కళా పీఠం" సంస్థ ప్రతిరోజు కవిత్వ రచన చేయిస్తుంది. అందులో ముఖ్యమైన కొన్ని కవితలను నేటినిజం పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం..

## జీవన పయనంలో ధైర్యంగా సాగాలి

జీవితం సుఖ దుఃఖాల సాగరం
అన్నింటిని తట్టుకుంటూ పోవాలి
బాదలొచ్చాయని భయపడకూడదు
ఓటమి ఎదురవుతుందని ముందే ఊహించి..
లక్ష్యాన్ని చేరుకునే ప్రయత్నం నిలపకు
అడ్డంకులు ఎన్ని ఎదురైనా ఆపకు నీ పయనం
నడిచే దారిలో ముళ్ళు రాళ్లు ఉన్నాయని
పూల బాట కాదు అని బాధపడుతూ కూర్చుంటే
విజయం నీ సొంతం కాదు ఎన్నటికీ
కష్టాలు కలకాలం ఉండవు అనుకుని
ముందుకు సాగుతూ పయనిస్తూ..
సుఖాల తీరం చేరుతావు అని నమ్మకం పెంచుకుని
బాధ్యత మరువక నీ వాళ్లకు భరోసాగా నిలిచే
ప్రయత్నంలో..
ఆటుపోట్లు ఎన్ని ఎదురైనా చింతించకు.
కడుపున పుట్టిన వారిని కాచుకునేందుకు ఇన్ని
బాధలా అని తల పట్టుకోకు
కాచిన చెట్టుకే కదా కర్ర దెబ్బలు
అందుకే..
జీవన పయనంలో
సుడి గాలులు ఎన్ని వచ్చినా బెదరక..
కట్టె కాలే వరకు నిజాయితీగా నిలవాలి.
అపుడే మనకు సమాజంలో
మంచి స్థానం లభిస్తుంది.

-మోదేపల్లి శీనమ్మ
+91 97048 54615

## ఆది దేవత

ఆది దేవత అమ్మ...
నా చేత తలరాతను మార్చేఅక్షరాలు దిద్దించిన శారదాదేవి,
నా భవితకు కలలుగన్న బంగారుబాటను సిద్ధం చేసిన పార్వతిదేవి,
నాలో అజ్ఞానమనే అంధకారాన్ని రూపుమాపిన సరస్వతీదేవి,
నా విజ్ఞానానికి అవధులు లేని గమ్యం వేసిన గురువు,
నా మేధో సంపత్తికి అంతేలేని పరీక్షలు పెట్టిన ఉపాధ్యాయిని,
నా జీవన ప్రమాణాలకి ఊహించని ప్రతిఫలం చూపిన తత్వవేత్త,
నా ఆలోచనా సరళిని సన్మార్గంలో నడిపిన దిక్సూచి,
నా ఆవేదనా తరంగాల గమనం మార్చిన శ్రేయోభిలాషి,
నాకు ప్రేమానురాగాలు పంచే వారధిగా మారిన ఆత్మీయపెన్నిధి,
నాకు వెల కట్టలేని ఆదరాభిమానాలను పంచే ఆత్మీయురాలు,
నా అలసటలో విసిగి వేసారకుండా అక్కున చేర్చుకున్న కల్పతరువు,
నా ఆనందంలో తన వంతు పాలు పంచుకున్న స్నేహితురాలు,
నా కవితా దృక్పథానికి చక్కని పునాది వేసిన కామధేనువు,
నా కవితల పూలకు పరిమళాలద్దిన తోటమాలి,
నా ఊహలకు ఊపిరి,
నా ఆశలకు ఆయువు... అన్నీ అమ్మే.... ,
నన్నే నాకు కొత్తగా పరిచయం చేసిన అమ్మా...!
నీకిదే నా వందనమమ్మా...
నా అక్షర నీరాజనం అందుకొనుమమ్మా...!!

- భూపతి సుమశ్రీ +91 85007 89389

## వేసవి సెలవులు

నేను వేసవి సెలవుల మొదటి రోజు 24వ తేదీ నుండి మా గ్రామం రేగులపల్లిలోని ఉన్నాను. టీవీ చూస్తూ, ఆటలు ఆడుతూ కాలక్షేపం చేశాను. తేదీ 26 ,27, 28 తేదీలలో ఎల్లమ్మ జాతర జరిగింది. 29న డిన్నర్ జరిగింది. 30 31వ తేదీన మా అన్న వాళ్ళ ఇంటికి పోయాను. అక్కడి నుండి రెండవ తేదీ స్వర్ణగిరికి వెళ్లాను. అక్కడ దేవాలయం చాలా బాగా ఉంది. రెండవ తేదీన యాదగిరిగుట్టకు వెళ్ళిన అక్కడ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం చాలా బాగుంది.ఆ తర్వాత మా అన్న దగ్గర రెండు వారాలు ఉన్నాను. ఆ తర్వాత మా పిన్ని దగ్గరకు వెళ్లిన అక్కడ మా బాబాయితో కలిసి సేవకు విజయవాడకు వెళ్లాను. అక్కడ కనకదుర్గ అమ్మవారి దగ్గర మనీ కౌంటింగ్ చేశాడు. మా బాబాయ్ నేను మా బాబాయి వెంట అక్కడికి వెళ్లి ఆ కౌంటింగ్ చూస్తూ ఉండిపోయాను.అది అయిపోయాక దర్శనముకు వెళ్లాము. ఆ తర్వాత తిరిగి ఇంటికి వచ్చాము మరుసటి రోజు బాబాయితో కలిసి సిరిసిల్లకు వెళ్లాను అక్కడ బట్టలు షాపింగ్ చేసి అయిపోయిన తర్వాత బిర్యానీ తిని ఇంటికి బయలుదేరాము. ఆ తర్వాత బాయి కాడికి వెళ్లి పొలం దున్ని పెసర్లు అలికి నీళ్లు పారించి మామిడికాయలు తెంపుకొని ఇంటికి వచ్చాము. వడ్ల దగ్గరికి వెళ్లి పరదాలు మంచిగా ఉన్నాయా లేదా అని చూశాం. మళ్లీ ఒక రోజు కొండగట్టులో కౌంటింగ్ కు వెళ్లాలని అనుకున్నాడు బాబయ్ కానీ కుదరలేదు. ఒక రోజులో వడ్లు పోతాయి అనగా జోర సంచులు తిర్లమర్ల తీయటానికి వెళ్ళినాము.తీసినంక వడ్లు జోకినారు. జోకి లోడింగ్ చేశారు. కొన్ని రోజులు మా చెల్లెలితోపాటు ఆనందంగా గడిపాను మా అన్న వచ్చాడు .మా అన్న వచ్చిన తర్వాత రెండు మూడు రోజులు అక్కడనే ఉండి వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయానికి మా అన్న తాతతో కలిసి వెళ్లాం. కానీ అక్కడ ప్రధాన ఆలయం రాజేశ్వర స్వామి ఆలయం కొత్తగా నిర్మిస్తున్నందున భీమేశ్వర స్వామి ఆలయాన్ని మాత్రం దర్శనం కల్పించారు. అక్కడ గుండు గీయించుకొని గుండంలో స్నానం చేసి దర్శనం లైను కట్టాము. గంటలోనే దర్శనం అయింది .అక్కడ దర్శనం చేసుకుని పక్కనే ఉన్న బద్ది పోచమ్మ అమ్మవారి దగ్గర లైన్ ఎక్కువగా ఉండటం చూసి బయటనే కొబ్బరికాయ కొట్టి టిఫిన్ చేసి ప్రసాదంకు లైన్ కట్టాము. ఒక గంట నిలబడి టికెట్ తీసుకున్న అలాగే పులిహోర రెండు లడ్డూలు తీసుకున్నాము. అక్కడి నుంచి ఇంటికి బయలుదేరి బాబాయి వాళ్ళ ఇంటికి వచ్చాము. అక్కడ రెండు రోజులు ఉండి మా ఇంటికి వచ్చాను.మా అన్న మా ఇంటికి వచ్చాడు. వచ్చినంక ఒకరోజు తర్వాత కోడి తెచ్చుకుని దుర్గమ్మ దగ్గర కోడి కోసి వండి తిన్నాం. మా అన్న రెండు మూడు రోజులు ఉండి వెళ్ళిపోయాడు ఇలా సెలవులు ఆనందంగా గడిచాయి 15వ తేదీ నుండి పాఠశాలలు ప్రారంభమయ్యాయి.

-రమేష్
9 వ తరగతి
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రామం రేగులపల్లి
మండలం బెజ్జంకి
జిల్లా సిద్దిపేట

కథలు

## చింత చచ్చినా పులుపు చావదు

అది ఒక పల్లెటూరు. ఎప్పటిలాగే సాయంత్రం వేళ మురళి గారు తన స్నేహితుడు వెంకన్నతో కలిసి నడకకు బయలుదేరారు. అంతలో, "నేనూ మీతో వస్తాను తాతయ్యా!" అంటూ మురళి గారి మనవడు జున్నుబాబు మారాం చేయడం మొదలుపెట్టాడు.

"మేము ఊరి చివర వరకు వెళ్తాము బాబూ! నువ్వు అంత దూరం నడవలేవు, పైగా నిన్ను నేను ఎత్తుకోలేను కూడా" అన్నారు తాతయ్య నచ్చజెబుతూ.

"నన్ను ఎత్తుకోవద్దు తాతయ్యా! నేను పెద్దోడిని అయిపోయాను కదా! నీతో కబుర్లు చెబుతూ హాయిగా నడుస్తాను" అన్నాడు జున్నుబాబు ఎంతో ఉత్సాహంగా.

"సరే నీ ఇష్టం" అని మురళి గారు మనవడి చెయ్యి పట్టుకుని, వెంకన్నతో మాట్లాడుతూ నడక సాగించారు.

కొంత దూరం వెళ్ళేసరికి వారి చిన్ననాటి స్నేహితుడు సింహాద్రి ఎదురయ్యాడు. "సింహాద్రి, బాగున్నావా?" అని పలకరించాడు వెంకన్న.

"బాగున్నాను" అని క్లుప్తంగా జవాబిచ్చి సింహాద్రి అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

అతడు వెళ్ళాక, "చిన్నప్పుడు మన తరగతిలో దొంగతనం చేసిన సింహాద్రేనా వీడు?" అని అడిగారు మురళి గారు.

"ఔనౌను, వాడే వీడు! 'చింత చచ్చినా పులుపు చావదు' అన్నట్లు ఇప్పటికీ వాడు తన పాత అలవాటు మార్చుకోకుండా దొంగతనాలు చేస్తూనే ఉన్నాడు" అన్నాడు వెంకన్న నిట్టూరుస్తూ.

మరికొంత దూరం వెళ్ళేసరికి దారిలో ధర్మరాజు గారు ఎదురయ్యారు. "రాజు గారూ! బాగున్నారా?" అని ఇద్దరూ ఆయన్ని పలకరించారు.

"మిమ్మల్ని కలుసుకోవడం చాలా సంతోషంగా ఉంది. పేదవారికి ఆర్థిక సాయం అందించడం కోసం వెళ్తున్నాను. నాకు తోచిన సాయం పదిమందికీ చేయడంలోనే నాకు అసలైన తృప్తి ఉంది" అని నవ్వుతూ చెప్పి వెళ్ళిపోయారాయన.

అప్పుడు మురళి గారు, "కొంతమంది అంతే! 'పుట్టుకతో వచ్చింది పుడకలతో గానీ పోదు" అన్నారు.

"నిజమే మురళి గారూ! చిన్నప్పటి నుంచి ధర్మరాజుకి సేవాభావం ఎక్కువ. తన ఆస్తినంతటినీ దానధర్మాలకే ఖర్చు చేశాడు. ఇప్పటికీ తనకొచ్చే పెన్షన్ డబ్బులను కూడా ఆపదలో ఉన్నవారికి ఇచ్చి ఆదుకుంటాడు" అని చెప్తూ, పక్కనే ఉన్న చింతచెట్టు చిగురును కోసాడు వెంకన్న.

అది గమనించిన జున్నుబాబు, "తాతా, ఇదేం చెట్టు?" అని అడిగాడు.

"ఇది చింత చెట్టు. దీని కాయలతో, పళ్ళతో చారు, పులుసు చేస్తారు. చింత చిగురు పప్పు ఆరోగ్యానికి మంచిది" అని చెప్పాడు తాతయ్య.

"మరి ఇందాక చింత చచ్చిపోయింది అన్నారు?" అని సందేహంగా తాత వైపు చూసాడు మనవడు.

"చింత చచ్చినా పులుపు చావదు" అనేది ఒక సామెత. చింత పండుని ఎండబెట్టినా, చింత చిగురుని ఎండబెట్టినా వాటి సహజ గుణం పులుపు ఎలాగైతే తగ్గదో. అలాగే మంచి గుణాలైనా, చెడు అలవాట్లైనా కొంత మందిలో చివరిదాకా అలాగే ఉంటాయి. అలాంటి వారి నుద్దేశించి చెప్పే సామెత ఇది" అని వివరించాడు తాతయ్య.

తాతయ్య చెప్పిన విషయం జున్నుబాబుకు బాగా అర్థమైంది. "చూశావా తాతయ్యా! నీతో వస్తే ఎన్ని కొత్త విషయాలు తెలుస్తాయో! అందుకే నీతో వస్తానని పట్టుబట్టాను. మరి నాకు చింతచిగురు పప్పు ఎప్పుడు తినిపిస్తావు?" అని ఆశగా అడిగాడు.

"రేపు వేడివేడి అన్నంలో, చింతచిగురు పప్పు, కమ్మని నెయ్యి వేసుకుని తృప్తిగా తిందాంలే" అన్నారు తాతయ్య.

"భలే భలే!" అని సంతోషంతో గంతులు వేస్తూ ఇంటి వైపు పరుగు తీశాడు జున్నుబాబు.



-కాశీ విశ్వనాథం పట్రాయుడు
9494524445

## మురిపాల మాలిక

కొమ్మను పూయిస్తా
కుసుమాల కిరీటాలు తొడిగిస్తా,
వసంతపు వేళల్లో
వన్నెల వేడుకలు జరిపిస్తా.

రెమ్మలు తొడిగిస్తా
పచ్చదనపు పట్టుచీరలు కప్పిస్తా,
గాలుల గుసగుసల్లో
గలగల గానాలు వినిపిసా.

బొమ్మను చూపిస్తా
అందాల అద్దంలో నిలబెడతా,
చూసే ప్రతి కన్నునూ
చిరునవ్వుల చినుకులు చిందిస్తా.

గుమ్మను వర్ణిస్తా
గులాబీలు గుర్తుకుతెస్తా,
గుబులును పుట్టిస్తా
గుండెలను పులకరింపజేస్తా.

రమ్మని పిలుస్తా
రాగాల పల్లకిలోకి ఆహ్వానిస్తా,
మనసుల మల్లెలతో
మమతల హారాలు అల్లిస్తా.

ఇమ్మని కోరుతా
ప్రేమను పరిమళాలను పంచమని అడుగుతా,
మానవతా మందిరంలో
మధుర బంధాలు నింపమంటా.

కమ్మని కవితలు కూరుస్తా
కావ్యసుమాలు పూయిస్తా,
మధుర భావసుధలతో
మనసులను మురిపిస్తా.



-గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్
సెల్: 7981616630

## విధిచేతిలో వింత. బొమ్మలు

ఇంటినే వదిలారో
దూరంగా విసిరేయబడ్డారో
నిత్యం కన్నీటి కడవలైన నేత్రాలు
కదిలిస్తే అశృవుల గాథలు..
నగరాల్లో, వీధి కూడళల వద్ద..
ఎక్కడ పడితే అక్కడ కనిపిస్తారు..
చిరిగిన మాసిన దుస్తులతో..
అట్టలు కట్టిన శిరోజాలతో..
దీనంగా చేతులు చేస్తూ..
భిక్షాటన చేస్తూ లేదా దొంగతనాలు చేస్తూ..
కనిపిస్తారు వీధి బాలలు..
తల్లిదండ్రుల అక్రమ సంతానమో..
ముష్టి వాళ్ల చేత చిక్కిన విధి వంచితులో..
రోడ్డు మీద చెత్త ఏరుకుంటూ..
రకరకాల వస్తువులు అమ్ముతూ..
కార్మికులుగా పని చేస్తూ కనిపిస్తారు..
మాదక ద్రవ్యాలకు,
చెడు వ్యసనాలకు లోనవుతారు..
మత్తులో నేరాలు, ఘోరాలు చేస్తారు..
సరియైన తిండి, నిద్ర వుండదు..
అపరిశుభ్రత వలన అనారోగ్యం పాలవుతారు..
నిరంతరం అభద్రత, మానసిక ఆందోళన..
ప్రభుత్వం, ప్రజలు కలిసి వీరి బాధ్యత తీసుకుని..
భద్రత కల్పించి, చదువు నేర్పించి..
సమాజానికి పనికి వచ్చేలా తయారు చేయాలి..

-పంతుల లలిత
+91 82477 57492

## కరెంటు పోయిన రాత్రి

కరెంటు పోయిన రాత్రి
సుట్టూరా చిమ్మంజీకటి
దీపంత లేకున్నా
వెలిగే నవ్వుల క్రాంతి.
గల్మ ముందట కూసుంటె
చల్లగాలి వాకిట్లో వాలి
అరుగంతా మనుషులతో నిండేది.
'మంచిగున్నవ' అనే పలకరింపు
మనసులో ప్రేమ నింపు
'తిన్నవా' అనేమాటనే
తుర్తిగా కడుపునింపు.
ఒకరి సంతోషంలో
ఇంకొకరి ఖుషీ
ఒకరి బాధలో
మరొకరి భరోసా.
కానీ...
ఇప్పుడు ఇన్వెర్టర్ నీడలో
అపార్ట్మెంట్ గోడల్లో
రాత్రి కూడా పగలైంది
మనుషులు మాత్రం
ఇంకా చీకట్లోనే ఉన్నారు



-బొల్లం బాలకృష్ణ
9989735216

## సైన్స్ - సెన్స్

విశ్వములో పరిణామ ప్రక్రియ భూగ్రహం
మనిషి కి జన్మ నిచ్చింది ఆఫ్రికా ఖండం
శిలాజ ,జన్యు ,ఆధారాలు చెప్పిన నిజం
ఖండ ఖండాంతరాలు దాటిన వలసలు
మనిషి అవసరానికి నేర్చిన పని ముట్లు
జీవనాధారానికి అవే ఆయువు పట్లు
సకల జీవ కోటి కి సవాల్ విసిరే మేధస్సు
నాగరికత పుష్పించి వెదజల్లే ఉషస్సు
గాలి మతం ,అగ్ని కులం ,అవని ప్రాంతం
ప్రకృతిని ప్రేమించడం సంస్కారం
మానవత్వం సంస్కృతి ,వైజ్ఞానిక స్పృహ ఆచారం
ఎర్రటి రక్తం బతుకు నిచ్చే సంప్రదాయం
శారీరిక సైగలు మన భావాల రాగాలు
లిపి సృష్టించి శబ్దాలుగా చెక్కిన బాషలు
పరిశోధన, తర్కం ,సత్య శోధనకు
వజ్రాయుధాలు
భిన్నమైన ఆలోచనలే ఆవిష్కరణలకు విత్తనాలు.
ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ రూపాలు
మూఢ నమ్మకాలు స్మశానికి దారులు
ఉగ్రవాదం,యుద్ధంతో ,సాధించేది శూన్యం
రెప్పపాటులో గాలిలో కలిసే ప్రాణం
తోటి మనిషిని ప్రేమించడం దివ్య గుణం
అప్పుడే మనిషన్న వాడి జీవితం సంపూర్ణం



-పూసాల సత్యనారాయణ
9000792400

## మన చేతల్లోనే ఉంది అంతా

పచ్చ పచ్చని చెట్లతో
గలగల పారే నదులతో
కిలకిల రావాల పక్షులతో
పుడమి పాడింది ప్రకృతి రాగం నాడు.
యంత్రాల ఘోషల్లో
కాలుష్య కోరల్లో
ప్లాస్టిక్, విషవాయుల కౌగిట్లో
పుడమి నలుగుతుంది నేడు.
మనుషిలో పెరిగే స్వార్థం
చెట్లను నరుకుతున్నాడు
అడవులను ఆక్రమిస్తున్నాడు
నదులను కాలుష్యం చేస్తున్నాడు
జాలువారే జలపాతాలు
కనుమరుగాయే
ఋతువుల రాగం గతితప్పే
పకృతి పగపట్టే.
నాణానికి ఇరువైపులాన్నట్లు
హరిత శోభ ఓవైపు
మసిబారిన మసక ఓవైపు
మన చేతుల్లోనే ఉంది
పుడమి తల్లి ఆయతి.
చెట్లను నాటు కాలుష్యం నివారించు
నదీ జలాలు కాపాడు
ప్లాస్టిక్ భూతాన్ని తరిమి కొట్టు
జీవజాతులను కాపాడు.
ఓ మనిషి స్వార్థం వీడు
పకృతితో మమేకమవ్వు
స్వచ్ఛమైన గాలులు పీలుద్దాం
భవిష్యత్తరాలకు అందిద్దాం.

-చాగంటి రాణి
+91 83677 49366

## నా పరిచయం

నా కాయం చివరికి మట్టే కావచ్చు
కానీ నా మనసెప్పుడూ ఉల్లాసమే.
నా సొగసు మూన్నాళ్ళ
ముచ్చటే కావచ్చు
కానీ నా ఛాయ కొన్ని జన్మల వరకూ పాకిపోతూనే ఉంటుంది.
నాకేమీ ప్రత్యేకతలు లేకపోవచ్చు
కానీ ప్రతిక్షణమునకూ నేనొక ప్రత్యేకతను
సంతరింప చేసుకుంటూ ఉంటాను
క్షణభంగురమే నా జీవితం
అది నేను కాదనను
కానీ
ఇదే నా పరిచయం



-గరిమెళ్ళ కాశీఅన్నపూర్ణ
96185 86277

## తెలంగాణ రణ ధీరులు

పల్లవి
సాయుధ పోరులోన ధీరులు
మన దాశరథి సోదరులు
జనం కొరకు జంగ్ నడిపిన యోధులు
మన పుచ్చలపల్లి, చంద్ర రాజేశ్వరులు
సాహితీ దిగ్గజం ఏటుకూరి ఎర్ర పాటలు .
అక్షర సేద్యకాడు కామ్రేడు మఖ్దూము
పత్రికా సంపాదకులు సురవరం ప్రతాపరెడ్డి
సాయుధపోరులోన సైనికుడు బద్దంఎల్లారెడ్డి
తిరుగుబాటు నిప్పు కనిక రావి నారాయణుడు
అందరూ అందరే ఉద్యమ శిఖరాలు
తెలంగాణ అవని పైన ఉదయించిన కిరణాలు.
తెలంగాణ పోరులోన నా గోడవ కాళోజీ
మలి దశ ఉద్యమం లో ప్రొఫెసర్ జయశంకర్
ప్రజా గాయకుడు యుద్ధనౌక గద్దర్
కమ్ముకున్న చీకటిని తొలగించిన దివ్వెలు
విప్లవాల దారిలోన పయనించిన ఘనులు.
ఉద్యమ తెలంగాణ పౌరుషాల నేల పై
రాణిరుద్రమదేవి,సమ్మక్క-సారలమ్మలు
కత్తి వట్టి కదం తొక్కిన వీరవనితలు
ఫ్యూడలీజం దొరల పైన తిరుగబడింది అయిలమ్మ
సమాజ మార్పుకై బందూకైంది ఆరుట్ల కమలమ్మ.
తెల్లోల్లను తరిమి కొట్టిన తెలంగాణ గడ్డ నాది
తిరుగుబాటు రుచి చూపిన తెగువ అడ్డ నాది
అందరి ఉత్తేజం ఒంటినిండా నింపుకొని
గొంతు ముడి విప్పుకొని పాలకుల నిగ్గదీస్తూ
చలిచీమల దండులా ఐక్యంగా పోరుదాము
అంతరాల గోడలను కూల్చుదాము
సరికొత్త సమాజాన్ని నిర్మిద్దాం .



-గడ్డమీది చంద్రమోహన్ గౌడ్
9866510399

## కలల సౌధము

కలలతో మొదలవుతుంది ప్రతి ఉదయం,
ఆశలతో నిండిపోతుంది ప్రతి హృదయం.
చిన్న కల అయినా చిగురించే దీపమై,
మన జీవిత మార్గానికి వెలుగై నిలుస్తుంది.
కలలు కేవలం నిద్రలో వచ్చే చిత్రాలు కావు,
మన గమ్యానికి దారి చూపే నక్షత్రాలు
అవి.
పడి లేస్తూ సాగిన
ప్రతి అడుగులో,
విజయపు సౌధాన్ని నిర్మించే
శిల్పాలు అవి.
ఒక రైతు కలలో పచ్చని పంటలుంటాయి,
ఒక విద్యార్థి కలలో వెలుగైన భవిష్యత్తుంటుంది.
ఒక శాస్త్రవేత్త కలలో కొత్త ప్రపంచముంటే,
ఒక కవి కలలో మానవత్వపు సంగీతముంటుంది.
కలలే మనసుకు రెక్కలు ఇస్తాయి,
కష్టాల సముద్రాన్నీ దాటించే పడవలవుతాయి.
ఆత్మవిశ్వాసం అనే గాలి వీచినప్పుడు,
అవి విజయ తీరాలకు తీసుకెళ్తాయి.
కలలు కనని జీవితం వెలుగులేని దీపం,
లక్ష్యం లేని ప్రయాణం దారిలేని నావం.
కలలే మనిషిని సాధారణం నుంచి
అసాధారణ శిఖరాలకు చేర్చే మెట్లు.
అందుకే యువత హృదయంలో కలలు మండాలి,
అవి దేశ భవిష్యత్తుకు దివ్యజ్యోతులవాలి.
ప్రతి కల ఒక కొత్త ఉదయాన్ని పిలుస్తూ,
మన భారతాన్ని మహోన్నతంగా తీర్చిదిద్దాలి

-కె. కె. రామచందర్
.+91 94934 02139

# కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న

## 'బుధవారం బాద్షా' పోటీ ఫలితాలు





అడ్మిన్: రమాదేవి కులకర్ణి
8985613123
నిర్వహణ: శ్రీమతి సత్య నీలిమ

## వీడిన మౌనం

ఎన్నో మాటల్ని
హృదయంలో దాచుకున్న మౌనం,
ఒక రోజు వీడిపోతే భావాల ప్రవాహమవుతుంది.
నిశ్శబ్దం వెనుక దాగిన బాధలు,
కాలం తాకిడికి కవితలై వెలుగుతాయి.
అణచుకున్న ఆవేదనకు స్వరం లభించిన వేళ,
మౌనం కూడా తన కథను చెబుతుంది.
వీడిన మౌనం ఓ ఓటమి కాదు,
మనసు మోసిన భారాన్ని దింపిన విముక్తి.
మాటలకందని భావాలన్నీ
వీడిన మౌనంలోనే కొత్త జీవితం పొందుతాయి.

-రజనీ కులకర్ణి

## ఎంతకాలమీ మౌనం?

పుట్టుక మొదలు చావువరకు
ఎన్నో బాధలు
అవమానాలు అపార్థాలు
లోలోన కుమిలి పోతూ నలిగిపోతూ!!.
కష్టపడ్డా కనికరం చూపని దుష్టత్వం
మగవాని అహంకార మనస్తత్వం
తొత్తులాగా పడివుండి తప్పులేకున్నా
తలవంచే గుణం
ఆశయాలు ఆశలు ఆవిరైపోతున్న
తలపులు ఎన్ని వున్నా మౌనమే
సమాధానం!!.
ఎదిరించని దుస్థితి
ఎంత కాలమీ
మౌన రోదన
నీకూ ఉంది స్వేచ్ఛ
అందరి పుట్టుక ఒక్కటే
నిర్భయంగా నిశ్శబ్దాన్ని ఛేదించు!!.
నీలో నువ్వే నలిగిపోక
విస్ఫొటనమై దూకు
నీ సత్తా చూపించు
భయాన్ని వీడు
ధైర్యాన్ని
కూడ గట్టుకొని
నీలో శక్తిని మేలుకొలుపు
శబ్ద భేరీ మ్రోగించు
రాక్షసాధముల పీచమణుచు!!.
అబలవు కావు అతివవు నీవు
ఆకాశాన్ని అందుకునే రెక్కల శక్తివి
ఏడుస్తూ చేతులు
ముడుచుకోకు
నిశ్శబ్ద తరంగానివై ఎగిసిపడు
దూకి సాగిపో ముమ్ముందుకు!!.

-డా॥చీదెళ్ళ సీతాలక్ష్మి

## మహోదయం

పెదవుల గడపపై
పాతుకుపోయిన నిశ్శబ్దం
కాలం గీసిన గీత కాదది
కన్నీటి మసితో రాసిన చరిత్ర.
గుండె గర్భగుడిలో
గాయాల దీపాలు వెలిగిస్తూ
ప్రతి ఊపిరీ
ఒక అణచివేతకు సాక్ష్యమై నిలిచింది.
ఒక రోజు
మౌనం తన శవపేటికను తానే పగులగొట్టింది
అప్పుడు పలికిన ప్రతి అక్షరం
మెరుపు ఖడ్గమై చీకట్లను చీల్చింది.
విరిగిన స్వప్నాల శకలాలనే
నేను అక్షరాలుగా ఏరుకున్నాను
బూడిదలో దాగిన నిప్పురవ్వలనే
కవితలుగా ఊదుకున్నాను.
మాట పుట్టిన చోట
భయం వాడిన ఆకు అయింది
సత్యం నడక మొదలుపెట్టిన వేళ
అసత్యం నీడకే భయపడింది.
వీడిన మౌనం
వసంతాన్ని ఆహ్వానించిన వృక్షంలా చిగురించింది
ఎడారిని ఆలింగనం చేసిన తొలి వానలా కురిసింది
చిరిగిన రెక్కలకు దారి చూపిన గాలిలా వీచింది.
ఇక నా గొంతు
గాయాల గాథ కాదు
గుండెల్లో గర్జించిన సముద్రం
ఇక నా పదం
ఒక సాధారణ పలుకు కాదు
మూగబోయిన తరాల శ్వాస.
ఎందుకంటే
వీడిన మౌనం
ఒక స్వరం పుట్టుక మాత్రమే కాదు
సత్యం తన ముఖాన్ని
తిరిగి పొందిన మహోదయం!.

-మక్కువ. అరుణకుమారి


## సునామీ

నవ్వుల వెనుక కన్నీరు దాచి నడిచిన దారులు ఎన్నో...
నిందల వానలో తడుస్తూ నిలిచిన రాత్రులు ఎన్నో...
వ్యంగ్యపు బాణాలు గుండెను గుచ్చినా వేదనను మింగిన వేళ...
అవమానాల అగ్నిలో కాలినా ఆశలను కాపాడిన వేళ...
పుట్టింటి పేరును పలికిన ప్రతిసారి పదునైన మాటలు విన్నాను...
నన్ను కన్న వాళ్ల ప్రేమను కూడా చులకన చేసిన చూపులు చూశాను...
నా తల్లిదండ్రుల గౌరవాన్ని కాపాడుకుంటూ మౌనమయ్యాను...
నా గుండెలో పుట్టిన తుఫానును నవ్వుతోనే దాచుకున్నాను...
చదువుకున్న చేతులకు సంకెళ్లు వేసి, నాలుగు గోడల మధ్య నిలిపావు...
ఎగరగల రెక్కలను మడిచేసి, ఇదే నీ లోకం అన్నావు...
నా కలలకు తాళాలు వేసి, నా దారులను మూసేశావు...
నా ప్రతిభను నీడలో ఉంచి, నా వెలుగును దాచేశావు...
చల్లని గాలి కోరిన వేళ అది విలాసమని చెప్పావు...
శ్రమ తగ్గించే చిన్న సాయం కూడా అనవసరమని తీర్పిచ్చావు...
నా అలసటను చూడలేదు... నా బాధను వినలేదు...
ఇంటి కోసం కరిగిన నన్ను, ఒక్కసారి కూడా గుర్తించలేదు...
పిల్లల ముందు నా మంచితనాన్ని చిన్నబుచ్చిన ప్రతి మాట...
నా త్యాగాలను మరిపించిన ప్రతి నిర్లక్ష్యపు చూపు...
నన్ను కాదు...
వారి హృదయాల్లో ఉన్న అమ్మ రూపాన్నే గాయపరిచింది...
అయినా...
కుటుంబం కోసం మౌనమయ్యాను...
సముద్రం ఎంత లోతైనా, ఒక రోజు ఉప్పెనైపోతుంది...
మౌనం ఎంత బలమైనా, ఒక రోజు ముకలైపోతుంది...
ఆ రోజు వచ్చినప్పుడు...
అది ఏడుపు కాదు... అది కోపం కాదు...
అది ఆత్మగౌరవం తిరిగి లేచిన క్షణం...
మౌనం సునామీ అయిన వేళ... మాటలు అలలై ఎగిసిన వేళ...
నన్ను నేను కనుగొన్న వేళ... నా విలువను నేనే రాసుకున్న వేళ...
ఇక నేను నీడను కాదు... ఇక నేను మౌనాన్ని కాదు...
నేను సముద్రాన్ని కుదుపేసే సునామీని... నేను గర్జనను... నేను శాశ్వతమైన సత్యాన్ని!!

-శ్రీసుధ కొలచన, హైదరాబాద్


ఆహ్వానము
జి.వి.ఆర్. ఆరాధన కల్చరల్ ఫౌండేషన్
డా॥రావూరి భరద్వాజ జయంత్యోత్సవం





జ్ఞానపీఠ పురస్కార స్వీకర్త డా॥రావూరి భరద్వాజ
స్మారక సాహితీ పురస్కారాన్ని
శ్రీ పరవస్తు లోకేశ్వర్ గారికి
శ్రీమతి రావూరి కాంతమ్మ స్మారక సేవా పురస్కారాన్ని
శ్రీమతి హరిప్రియ గారికి ప్రదానం

పురస్కార స్వీకర్తలు
శ్రీ పరవస్తు లోకేశ్వర్



సాహిత్యం
10,000/- రూపాయల నగదు పురస్కారం

శ్రీమతి హరిప్రియ



సంగీతం
5000/- రూపాయల నగదు పురస్కారం


ముఖ్యఅతిథి : డా॥పాలకుర్తి మధుసూదనరావు
పూర్వ సి.ఇ.ఓ.శ్రీ వేంకటేశ్వర భక్తిఛానల్, టి.టి.డి.
సభాధ్యక్షులు : శ్రీ బైస దేవదాసు
సంపాదకులు, నేటినిజం దినపత్రిక
ఆత్మీయ అతిథి : శ్రీమతి కేతవరపు రాజ్యశ్రీ
సాహితీవేత్త
సభాప్రారంభం : శ్రీ పొత్తూరి సుబ్బారావు
సంపాదకులు, సాహితీకిరణం
అతిథిసత్కారం : శ్రీ రావూరి వెంకట కోటేశ్వరరావు
ధర్మకర్త (ట్రస్టీ), డా॥రావూరి భరద్వాజ - రావూరి కాంతమ్మ ట్రస్ట్
సభానిర్వహణ : శ్రీ పెద్దూరి వెంకటదాసు
కవి, రచయిత

సాంస్కృతిక కార్యక్రమం
చిన్నారి శ్రీధృతి తిమ్మరాజుచే 'రామాయణశబ్దం' కూచిపూడి నృత్యం
&
కోమల సమన్విత కూచిపూడి నృత్యాలయంవారి కూచిపూడి నృత్యం

తేది:05.07.2026, ఆదివారం సా॥5.00గం॥లకు
కళాలలిత కళావేదిక (శ్రీ త్యాగరాయ గానసభ), చిక్కడపల్లి, హైదరాబాద్
లయన్ వి.వి.రాఘవరెడ్డి
ప్రధాన కార్యదర్శి : 9866332738

## 'మేంగో' కాలమ్





- పి.చంద్రశేఖర అజాద్
92465 73575

## పిల్లలకూ ఓటు హక్కు ఇవ్వండి

ఈ మధ్య రాజకీయాల్లో జరుగుతున్న రకరకాల విన్యాసాలు చూశాం నేనూ, విదూ, అన్యలు. ఏకకాలంలో అయిదారు డెయిలీ సీరియల్స్, ఆరేడు భాషల్లోని రకరకాల సినిమాలు చూసినట్లు అనిపించింది. అబ్బబ్బ ఎన్ని ట్విస్టులు. ఎంత చర్చ. ఎంత విజ్ఞానం దేశ ప్రజలకు అందించారో చెప్పటానికి లేదు.

ఇవన్నీ చూస్తున్నప్పుడు అన్య, విదూ ముఖాల్లో ఏదో కనిపించింది. అది కోపమా, అనుమానమా, అసహాయతా, ఇవన్నీ కలిసినవా. మరేదైనానా అని నాకు ధర్మసందేహమో, అధర్మ తిక్కనో కలిగాయి. అప్పుడు అడిగాను.

"మీరిలా ఫేస్‌లు పెడితే నాకు అర్థం కాదు. సైలెన్స్ ఓ ఆయుధం అంటారు. అది శత్రువుల మీద ప్రయోగించాలి. స్వజనుల మీద కాదు. అయినా ఆడవారి నోటిలో మాట దాగదు అంటారు. నువ్వేంటి అన్యా? నీకు మౌనం నప్పదు. షూట్ చెయ్యి" అన్నాను.

"ఎవడు మేంగో ఆడవారి నోటిలో మాట దాగదన్న పురుషోత్తముడు. మీ మగవారి నోటిలో ఏది దాగుతుంది? నీలోనూ పురుషాహంకారం మొదలవుతోంది" అని కోప్పడింది.

విదూ కూడా సైలెంట్‌గా వున్నాడు.

"ఈ ముక్క ఎవరన్నా నేను కోట్ చేయాల్సింది కాదు. నన్ను క్షమించు. తుఫాన్‌కి ముందు ప్రశాంతత లేదా నిశ్శబ్దం అని నేను అనుకోలేదు" అన్నాను.

"ఇన్ని జరుగుతున్నా మనం ఏమీ మాట్లాడలే కపోతున్నాం. మన అభిప్రాయాల గురించి ఎవరన్నా అడిగారా ఇంట్లోగాని, బయటగాని" అంది అన్య సీరియస్‌గా.

"అడగరు" అన్నాడు విదూ అంతే సీరియస్‌గా.

"ఎందుకు?" అన్నాను.

"మనకు ఓటు హక్కు లేదు కాబట్టి!" అన్నాడు.

ఒక్కసారిగా నిశ్శబ్దం. విదూ గాడు బాంబు పేల్చాడు.

"అందుకు పద్దెనిమిది సంవత్సరాలు నిండాలి కదా!" అన్నాను.

"ఎందుకు నిండాలి?" అంది అన్య.

"ఇదేదో సీరియస్ టాపిక్. మన ఛానల్‌లో ఈ విషయం మీద చర్చ పెడదాం. అందులో అన్య వుంటుంది. అలాగే మిస్టర్ క్లీన్ అండ్ ది గ్రేట్ క్రిటిక్ వుంటారు. నేను యాంకర్‌గా వుంటాను" అన్నాను.

అప్పటికప్పుడు వారిని కలుసుకున్నాం.

"నేను ప్రీచర్నే. కానీ ఇలాంటి చర్చల్లో నేను పాల్గొనను" అన్నాడాయన.

"అదేంటి?" అన్నాం.

"మీ చర్చ అరగంట లేదా గంట వుంటుంది. అందులో నలుగురు కనీసం వుంటారు. ఇందులో యాంకర్ గారి అది పురుషుడైనా, మహిళ అయినా పది నిమిషాలు ఇంట్రో వుంటుంది. వడదెబ్బ తగులుతుంది చూసే వాళ్ళకి. తర్వాత అయిదు నిమిషాల ప్రకటనల జాతర వుంటుంది. అది అరగంటైనా గంటయినా యాంకర్ ఎన్ని నిమిషాల ఉపన్యాసం, మధ్యలో ఎన్ని నిమిషాల జోక్యం, గెస్టులు ఎంతసేపు మాట్లాడతారు లెక్కలు తీయండి" అన్నాడు.

"అయితే ఏమంటారు మెంటార్‌జీ" అన్నాం ముగ్గురం.

"ఈ మాత్రం భాగ్యానికి పనులన్నీ మానుకుని స్టూడియోకి వెళ్ళాలా. చర్చ ఫ్రమ్ హోమ్ చేయాలా? ఉదయం పూట ప్రవచనాలు చెబుతుంటారు కదా. వారిని ఎవరూ డిస్టర్బ్ చేయరుగా. అలాగే ఈ యాంకర్స్ కూడా ఉపన్యాసం, తనే ప్రశ్నలు వేసుకుని, తనే జవాబులు చెప్పుకుంటే సరిపోతుంది కదా" అన్నాడు.

ముందే చెప్పాం కదా మా పెర్‌ఫెక్ట్ గారు ఈకకు ఈక తోకకు తోక పీకి పాతరేస్తారు అని. వారికి అలాంటి ప్రమాదం లేదని, మీరు మాత్రం ఎంతసేపయినా మాట్లాడవచ్చు. మా తరపున అన్య మాట్లాడుతుంది అని కన్విన్స్ చేశాం.

"మాకు కూడా ఓటు హక్కు కావాలి. అప్పుడే అయిదు సంవత్సరాలకు మధ్య మధ్యలో వచ్చే ఎన్నికలకు మమ్మల్ని మనుషులుగా గుర్తిస్తారు" అంది అన్య.

"పుట్టగానే పౌరసత్వం వచ్చినట్లు మీరు ఓటు హక్కుతోనే పుట్టమంటున్నారా?" అన్నాడు గురూజీ.

"అవసరం లేదు. ఇప్పుడు ఆరు సంవత్సరాలు నిండితేనే మొదటి తరగతి అంటున్నారు. ఆరు సంవత్సరాలకు ఓటు హక్కు కల్పించాలి. మీకు బటన్ నొక్కటం చేతవునా అంటారు. రెండు సంవత్సరాల నుండే పిల్లలం బటన్లు నొక్కుతున్నాం కదా!" అంది అన్య.

"అంతేనా ఎన్నికల్లో పోటీ చేస్తారా?"

"అవన్నీ తర్వాత నిర్ణయించుకుంటాం. మేం కూడా పార్టీలు పెడతాం. ఐస్‌క్రీమ్ కొండలు, సాఫ్ట్ డ్రింక్స్ పూల్‌లు, చాక్లెట్ల మందిరాలు ఏర్పాటు చేస్తామంటాం. ఇంకా మేం చెప్పాల్సినవి, చేయాల్సినవి చాలా వున్నాయి" అంది అన్య.

"ఇదీ విప్లవం అంటే. అయినా ఆరు సంవత్సరాలకు మెచ్యూరిటీ ఎలా సాధ్యం అంటారు. దీనికి మీ సమాధానం ఏమిటి?" అన్నాడు గురూజీ.

"అయ్యా! మీరు యాంకర్ పాత్రను పోషిస్తున్నారు" అన్నాను.

"అదేం లేదు. అన్యని మాట్లాడనీ" అన్నాడు గురూజీ.

"మెచ్యూరిటీ అనగానేమి? అది ఎన్ని సంవత్సరాలకు వస్తుంది. ఇరవైకా, అరవైకా, అసలు ఎప్పటికీ రాదా? మనం ఇన్ని దశాబ్దాల నుండి ఎన్నికల తతంగం చూస్తున్నాం. ఎంతమంది ఓటు వేస్తున్నారు? వేయనివారికి అవి ఎందుకు? ఇంకా మద్యం, డబ్బులు తీసుకోకుండా ఎంతమంది ఓటు వేస్తున్నారు. ఉచితానుచితాలు లేకుండా ఎవరయినా 'ఫ్రీ' అనకుండా ఎన్నికలకు వెళ్తున్నారా? ఇదేనా మెచ్యూరిటీ అంటే. నా ముడ్డి కాకపోతే కాశీదాకా దేకుతానన్నాడంట ఎవరో-మా అమ్మమ్మ చెబుతుంది. ఫ్రీ గా ఎవడయినా ఇచ్చేదేంటి గురూజీ. అన్నీ పుచ్చుకోవటమే కదా. ఇప్పటికి ఎన్నిసార్లు రాజ్యాంగం మార్చలేదు. అందుకని పిల్లలూ ఓటర్లే అని ఇంకోసారి మార్చండి" అంది అన్య ఆవేశంగా.

"శభాష్ పిల్లలూ. ఇది ఇప్పట్లో తేలే అంశం కాదు. ఇంకో రెండు మూడు సెషన్లు కావాలి. ముందుగా నేను మీకు మద్దతు ప్రకటిస్తున్నాను. పిల్లలకు ఓటు ఇవ్వటానికి పెద్దలూ, రాజకీయ పార్టీల వారూ ఒప్పుకుంటారు. కాకపోతే ఆడవారికి సగం సగం అంటే ఒప్పుకోరు. ముందు ఓటు హక్కు వచ్చాక ఆకాశంలో పిల్లల వాటా ఎంతో తేల్చుకుందాం" అని మిస్టర్ క్లీన్ ముక్తాయించారు. ●

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1811వ రోజు **'రక్తదానం'** అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. **'రక్తదానం'** అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం.

-సంపాదకులు

**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం**

అడ్మిన్ & ఏకాంశ కవిత్వ నిర్వహణ:
-డా॥రాయారావు సూర్యప్రకాశ్‌రావు, 9441046839



## ప్రాణదాతా సుఖీభవ

ఆపదలో ఆదుకోవడం
మానవత్వం
ప్రాణాపాయ స్థితినుండి
రక్షించే ప్రాణదాత సుఖీభవ!!.
సంజీవని తెచ్చి
లక్ష్మణుని ప్రాణం
నిలిపిన హనుమాన్
విలవిలలాడే పావురాన్ని
కాపాడిన బుద్ధుడు
రక్తం పంచి ఇచ్చిన
కన్నతల్లి
గాలిలో కలిసే ప్రాణానికి
ఊపిరిపోసే
వైద్యనారాయణులు
దేవతలే ఇలలో!!.
నేత్ర దానం
రక్త దానం
అవయవ దానం
గుండెమార్పిడి
కిడ్నీ దానం
అన్నదానం
దానం ఏదైతేనేం
బ్రతుకును ఇస్తూ
ధైర్యం ఇచ్చే
ఆరోగ్య రక్షకులు
సదా స్మరణీయులే!!.
రక్తంలో రకాలు
కలిస్తేనే ప్రాణం దక్కు
వికటిస్తే ప్రాణహాని
రక్తదానం మిన్న
అన్ని దానాల కన్న!!.
కరువు తీర్చే జీవన దాత
సకల లోక సంరక్షకా జయహో!!

-డా. చీదెళ్ళ సీతాలక్ష్మి

## వెలుగు రేఖ

జీవన యానంలో
ముఖ్యం రక్త ప్రసరణ
ఆ ప్రవాహం
కొన్ని క్షణాలు ఆగినా
మృత్యువు ఆసన్నమైనట్టు అనిపిస్తుంది
శరీర వ్యవస్థ సక్రమంగా ఉండాలంటే
రక్తం ప్రవహించవలసినదే
రక్తంలో రకరకాల గ్రూపులు
పాజిటివ్వూ నెగిటివ్వూ
ఇచ్చే దాతల వల్ల పునర్జన్మ ఎత్తినట్లే
మానవ శరీరానికి ప్రతి అవయవం ముఖ్యమే
పోయిన వారి అవయవాలు
దానం చెయ్యాలి
అంతకంటే ఉత్తమ పుణ్యకార్యం
ఏమీ ఉండదు
నేత్రదానం
హృదయదానం
కిడ్నీ దానం
గతించిన వారి అవయవాలు
వెంటనే తీసి దానం చేస్తే
మనిషికి కొత్తజీవితం ప్రసాదించినట్లే
రక్తదానం పునర్జన్మకు నాంది
అంతకంటే ఏదీ ఎక్కువకాదు
ఎర్రటి రక్తం జీవితాన్నిఇచ్చే
వెలుగు రేఖ అవుతుంది.

-ఆర్. రమాదేవి

## జీవనాధారం

మనిషి జీవిత బండి
హాయిగా నడవాలంటే
శరీర అవయవ యంత్రాంగంలో
రక్త ప్రవాహం సాగుతూనే ఉండాలి
ఒక్క క్షణం ఆగినా
మంచుకొస్తుంది ముప్పు
తరుముకొస్తుంది మృత్యువు.
ముప్పును దాటాలంటే
ఎర్రటి నెత్తురు
శరీర పైపు లైన్లో నింపవలసిందే
రక్తం రకరకాల గ్రూపులు
దొరకడం కష్టం
ఇచ్చే దాతలు
పునర్జన్మ గర్భ నిర్మాతలు
వాళ్ళను మరువకుండా ఉంటే
అదే పుణ్యఫలం.
చూస్తుంటే నయనానందం
కళ్లు దానం చేస్తే
చిరంజీవై నివసిస్తారు నూరేళ్లు
పోయిన మనిషినీ నివసించేవారిలో
చూసుకోవచ్చు శ్రద్ధగా.
రక్తదానం
పునర్జన్మకు జీవనాధారం
కళ్లదానం
కదిలే కాలానికి సమాధానం
దానం కన్నా మిన్న
ఏ ధర్మంలేదు
ఎర్రటి నెత్తురు
సూర్య కిరణమై వెలుగుతుంది
కంటి చూపు రాగల రోజులకు
దారినిస్తుంది.

-పొన్నాల ధనమ్మ

## బ్లడ్ బ్యాంకులు నింపేద్దాం

గుండె దేహంలోని
రక్తాన్ని శుద్ధి చేయాలి
నరనరానికీ
రక్తం సరఫరా కావాలి.
ప్రమాదాలలో నరాలు తెగిపోతే
బయటకు పోతుంది
ప్రాణాలను నిలిపే రక్తం.
గుండాడటానికి
ముడిసరకు రక్తమే,
ఆ రక్త కొరతకు
అల్లల్లాడిపోతుంది గుండె,
గుండె కొట్టుకుంటూ
ఊపిరి నిలిపేందుకు
రక్తం కోసం అలమటించి
ఆరాటపడుతుంది.
మానవుల చలనానికి
కావాలి ఊపిరి!
ఎదలోని గుప్పెడు
గుండాడితేనే ఊపిరి!!
ఊపిరాగితే
దేహ కదలికలు ఆగిపోతాయి!
కదలిక లేని దేహాలు
శవాలైపోతాయి!!.
రక్తానికి ప్రతిగా
కృత్రిమ రక్తం లేదు
తోటి ప్రాణాన్ని కాపాడి తరించేందుకు
ఆరోగ్యవంతులెవరైనా
వయసు పద్దెనిమిది పైనా
అరవై లోపుంటే ...
రక్త దానంతో
ఉసురులు నిలపొచ్చు.
రక్తదాత ఆస్తులేమీ పోవు
ఓ ఇల్లాలి తాళిబొట్టునో
ఓ తల్లి కడుపు తీపో
ఓ తండ్రి ఆర్తనాదమో
నిలువరించి వాళ్ళ మనసుల్లో
దేవుడిగా నిలిచే పవిత్రమైన పనది.
అందుకే -
అరుదైన రక్త గ్రూపులకు
బ్లడ్ బ్యాంకులను నింపి
మానవజన్మకు
పరిపూర్ణతను తెద్దాం.

-విత్తనాల విజయకుమార్

## సార్థకం

రక్తదానం ప్రాణదానంతో సమానం
రక్తదానం చేయాలి విరివిగా
గాయపడ్డ వాళ్ళకు
శస్త్రచికిత్స చేయించుకున్నోళ్ళకు
తలసేమియ రోగులకు
పునర్జన్మను ప్రసాదించాలి
ప్రత్యక్ష దైవాలుగా మారండి
రక్తదానంలో
స్వప్రయోజనమూ ఉందని తెలపండి
కొత్త రక్తకణాల ఉత్పత్తి
గుండె జబ్బుల నివారణ
నూతన రక్తం ఉత్పత్తితో
ఆరోగ్యం
రక్తదాతలకూ లాభాలే
అపోహలన్నింటిని వీడేట్లు చేయండి
ఆరోగ్యవంతులు రక్తదానం చేయాలి
మానవత్వం ప్రజ్వరిల్లాలి
ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలి
రెడ్ క్రాస్ సొసైటికి చేయూతనివ్వాలి
రక్త బ్యాంకులు నిండుగా ఉండాలి
రక్తలేమితో మరణాలు ఆగిపోవాలి
మానవ జన్మ సార్థకం కావాలి.

-గుండం మోహన్ రెడ్డి

## ప్రాణదానం

హీమోఫీలీయా రుగ్మత
పొరపాటున శరీరముపై గాటు
ఆగని రక్తస్రావం
శరీరానికి రక్తహీనత
రక్తము ఎక్కించాలని వైద్యుని సలహా.
ప్రసూతి సమయములో
అధిక రక్తస్రావం
రక్తం ఎక్కించకుంటే
ప్రాణానికి ముప్పు
సిజేరియన్ ఆపరేషన్
తక్కువగానున్న రక్తం
రక్తం ఎక్కించకుంటే ప్రాణాపాయం.
రోడ్డు ప్రమాదంలో
ఎందరికో గాయాలు
తీవ్ర రక్తస్రావం
ప్రాణాపాయ స్థితి
రక్తం ఎక్కించాలన్న వైద్యులు
తగ్గని డెంగ్యూ జ్వరం
తగ్గిన ప్లేట్లెట్ కౌంటు
ప్లేట్లెట్లు ఎక్కించాలని
డాక్టరు సూచన
తలసేమియాతో బాధపడే వ్యక్తుల్లో
తరచూ రక్తహీనత
రక్తం ఎక్కించాలని
వైద్యుల సలహా.
ఎందరో రక్తార్థులై
ఎదురుచూస్తున్నరు
మానవత్వంతో ఆదుకునే
బాధ్యత మనది
పద్దెనిమిదేళ్ల నుండి
అరవై ఐదేళ్ళ లోపు వయస్సున్న
ఆరోగ్యవంతులు
ఏడాదికి పురుషులు నాల్గుసార్లు
స్త్రీలు మూడుసార్లు
రక్తదానం చేయొచ్చు.
రక్త దానం
ముగ్గురిని బతికించవచ్చు
రక్తదానం ప్రాణదానమే
విరివిగా చేద్దాం
ఎందరికో మరుజన్మనిచ్చి తరిద్దాం
మానవత్వాన్ని చాటుకుందాం.

-గిరిమాజి దామోదర్

## ప్రాణదాతలు

రక్తదానం ప్రాణదానం
జీవకోటికి ప్రాణాధారం
రక్తం లయకారుడు రుద్రుడైతే
రుద్రవర్ణ రక్తం లయమే
దైవమే
పంచభూతాలలో ప్రాణవాయువు
ఆయువు పట్టు అయితే
షడ్భూతము రక్తం
రక్తహీనం ప్రాణహీనమై
అనారోగ్యానికి మూలం
సకల ప్రాణహితాన్ని కోరేది
రక్తమొక్కటే
మనుషుల జీవనానికి
కులమతాలు అడ్డమైతే
సమానత్వం చాటించేది
వర్గ విభేదాలు అంటనిది
రక్తమొక్కటే.
రక్తదానం
నవజీవనానికి నాంది
ప్రాణాపాయస్థితిలో
పునర్జీవనం ఇచ్చేది రక్తం
ప్రతి మనిషిలో ఉండే రక్తం ఒకటే
వర్గ వైరవిబేధము వీడి
సమాజంలో రక్తదానంపై
అవగాహన పెంచుదాం.
ఆరోగ్య జీవనంతో రక్తవృద్ధిని పొంది
రక్తదాతలమై ప్రాణదాతలుగా మారుదాం.

-ఇమ్మడి రాంబాబు

## మహాదానం!!

ఇంటికి దీపమైన ఇల్లాలి అనారోగ్యం
రక్తమవసరమైన సందర్భంలో
ఇదుగో నేనున్నా అంటూ
యువత ఇచ్చిన రక్షణజ్యోతి
రక్తదానం వెలకట్టలేని ద్యుతి!!.
కుటుంబ మూలస్తంభం
ప్రమాదంలో రక్తమోడిన రహదారి!
అందుకున్నది స్నేహితుల రక్తం
అదే కదా అసలు సిసలు మైత్రీ బంధం!!
బోసినవ్వుల ముద్దుపాపాయి
రక్తహీనతతో తల్లడిల్లెనోయీ
అనేక మాతృహృదయాల స్పందన
రక్తదానంతో పసిపాప
ఊపిరికి చేతన!!
ఆ తల్లి మనసులో
ఎనలేని కృతజ్ఞతల వాన!!
మనిషి చేయగలిగిన
మహాదానం రక్తదానం!.

-ఎం.వి.ఉమాదేవి

## ఎంతో పుణ్యం

రక్తదానం ఎంతో పుణ్యం!
ముమ్మాటికి ఇది ప్రాణదానమే!
ప్రమాదంలో గాయాలతో
శరీరంలో రక్తం నేలపాలైతే
ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రి చేరితే
ఎక్కించాలి రక్తమని డాక్టర్ అంటే
రక్త నిధి కెళితే
అక్కడ షరతులు!
ఏ మిత్రుడిని ఐనా బ్రతిమాలితే,
లభిస్తుంది ఒక లీటరు రక్తం!
రక్తం అందడం ఆలస్యమైతే
రోగి ఆయుష్షు ఇక తీరినట్టే!
కుటుంబీకులే
రక్తదానానికి వెనుకాడితే
ఎలా ముందుకొస్తారు ఇతరులు!
శస్త్ర చికిత్స సమయంలో
పోతుంది ఎంతో రక్తం
రోగినుండి...
ఆ సమయంలో కావాలి
రోగికి రక్తం!
శాస్త్రోక్తంగా రక్తం భద్రపరచకున్నా
పొరపాటున ఘనీభవించినా,
రోగిష్టి రక్తం సేకరించి ఉంచినా
ప్రాణాలకే ముప్పు
ఆసుపత్రిలో రోగికి!
మానవత్వంతో ముందుకు సాగి
రక్తదానం చేస్తే ఎంతో పుణ్యం!
తరతరాలకు ఎంతో మేలు
నిలపండి ఒక ప్రాణం రక్తదానంతో!
నేత్రదానం
కిడ్నీ దానం?
ఏదైనా...
ఆ రోగికి మరో జన్మనిచ్చినట్లేగా!!.

-కోలా సత్యనారాయణ

## ఘనమైన దానం

దానగుణం
మనిషికి గొప్ప నిదానం
దానానికి ధనమొక్కటే
మూలంకాదు.
ఆకలేసిన వానికి
నీ అన్నంలో కొంచెమిచ్చినా
అదే గొప్ప దానం.
ప్రస్తుతం ప్రపంచ రీతి
ఉరుకులు పరుగులు.
దాని ఫలితమే
బాటలన్నీరక్తసిక్తం
ప్రయాణాలు కావవి
ప్రమాదాలకు వాకిళ్ళు.
దుర్ఘటనలలో
దుర్మరణం పాలయ్యే వారు కొందరు
శరీర భాగాలు కోల్పోయి
తన రక్తం రోడ్డుకు సమర్పించి
చితికిన జీవితాలు కొన్ని
ఇటువంటి వారికి
ఇవ్వాలి రక్తదానం
చూపాలి మానవత్వం.

-డా.సి.వసుంధర

## ఆకట్టుకున్న చిన్నారుల శాస్త్రీయనృత్య ప్రదర్శన



నృత్య ప్రదర్శన ఇచ్చిన చిన్నారులను అభినందిస్తున్న పావనీ వినయ్‌కుమార్

హైదరాబాద్, జులై 1: శాస్త్రీయ నృత్యంలో బాలలు, యువకళా కారులను ప్రోత్సహించడం అభినందనీయమని గాంధీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఏ. పావనీ వినయ్‌కుమార్ అన్నారు. శ్రీ రామజయరామ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో మంగళవారం మధ్యాహ్నం త్యాగరాయ గానసభలో బాలకళాకారులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శాస్త్రీయ నృత్యాన్ని ప్రదర్శించిన చిన్నారులను ఆమె సన్మానించి అభినందించారు.కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నేత వినయ్‌కుమార్, పార్వతి, రామ్మోహన్, ఆనంద్‌రావు, జ్ఞానేశ్వర్, బాలకళాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## విదేశీ మోజులో దేశ సంస్కృతిని మరువద్దు: ఎమ్మెల్సీ



శశికళస్వామికి పురస్కారం ప్రదానం చేస్తున్న అతిథులు

హైదరాబాద్, జులై 1: విదేశీ మోజులో దేశ సంస్కృతిని మరువద్దని ఎమ్మెల్సీ మధుసూదనచారి అన్నారు. భీమన్న సాహితీ నిధి, కళానిలయం ఆధ్వర్యంలో శుక్రవారం త్యాగరాయ గానసభలో లలితగీత గాయని శశికళస్వామికి విజయపల్లవి సంగీత పురస్కారాన్ని అందజేశారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న మధుసూదనాచారి శశికళస్వామికి పురస్కారం అందజేసి మాట్లాడారు. మహాకవి బోయిభీమన్న కుమార్తె బోయి విజయపల్లవి జయంతి సందర్భంగా ప్రముఖ గాయని శశికళస్వామికి పురస్కారం అందజేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సాహితీవేత్త గౌరీశంకర్, ఆచార్య కోయి కోటేశ్వరరావు, సుంకర సత్యనారాయణ, రేణుకాప్రభాకర్ పాల్గొన్నారు.

## మిట్టపల్లి సురేందర్‌కు 'మా భూమి' పురస్కారం



హైదరాబాద్, జులై 1: ప్రజాకవి దాశరథి కృష్ణమాచార్య జయంతి సందర్భంగా ఈ ఏడాది మాభూమి ప్రజా సాహిత్య పురస్కారానికి గేయ రచయిత, గాయకుడు మిట్టపల్లి సురేందర్‌ను ఎంపిక చేసినట్లు మా భూమి సాహితీ సాంస్కృతిక చైతన్య వేదిక సమన్వయకర్త గొర్రెపాటి నరసింహప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజల గొంతుకను పద్యంగా, పాటగా, పోరాటంగా మలిన సాహితీ స్రష్టలను గౌరవించడమే ధ్యేయంగా 2024 నుంచి ప్రతి ఏటా దాశరథి జయంతినాడు అవార్డు ప్రదానోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు ప్రజా కవులు గోరటి వెంకన్న, జయరాజ్ ఈ పురస్కారాన్ని అందుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎల్బీనగర్ వాసవి శ్రీ నిలయంలో జులై 12న అవార్డు ప్రదానం చేస్తున్నట్లు ప్రకటనలో వెల్లడించారు.



నిర్వహణ
-కందుకూరి శ్రీరాములు
-బెల్లంకొండ సంపత్ కుమార్

తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ప్రతి వారం 'జూమ్'లో నిర్వహిస్తున్న "సోమవారం కవిసమ్మేళనం - కవివారం'లో కవులు పాల్గొని చదివిన కొన్నికవితలను నేటినిజం పాఠకుల కోసం..

-సంపాదకులు

### ఆకాశం తల్లి ...

ఆకాశం
విత్తనానికి
చినుకు
పాలు తాగించింది.
విత్తనం
మొలకై
రెండు
చిన్ని లేత ఆకుల
చేతులతో
ఆకాశం తల్లికి
కృతజ్ఞతలు
చెప్పింది

-కందాళై రాఘవాచార్య
8790593638

### పుడమికి గొడుగై

భూగోళ పుట్టుకకు మొక్కకు
మానుల ఎదుగుదలకు
మనిషి కారకుడు కానప్పుడు
విధ్వంసం చేసే హక్కెక్కడిది.
కనుచూపు పడిన కాడికి
భూమి నాద నుకోవడం అవివేకమే
సర్వ జీవారాశి లెక్క మనిషిదీ.
ఓ పుట్టుకేనని మరవద్దు
ప్రకృతినాదారం చేసుకుని
జీవించే జీవులను భక్షించే.
క్రూర మృగాలను మించి భక్షిస్తున్న
మానవుడు మాధవుడేల .
దరిత్రి గర్భమున పురుడోసుకున్న
మానుల తలలు నరికి
మౌన శోకమునకు మూలంనీవైతే
మహా నీయుడవెట్ల
పాపిష్టి చూపు తగిలి.
పచ్చని ప్రకృతిని విధ్వంసం చేస్తు
మలినపు రంగు పూసుకున్న మనసులు
జీవ మనుగడను శాశించే ఆధిపత్యం
వెయ్యేండ్లు స్థిరమనుకుని
వెర్రితలలు వెంపర్లాట.
వేళ్ళ ఏళ్లనాటి మానుల
ఊడల నీడన తలదాచుకునే
వన్య ప్రాణుల సంతతి
అంతరించడానికి మనిషే మృగమై
అడవినే వేటాడుతుంటే గొప్పోడెట్ల
పర్వత శ్రేణుల ఒంపు ఒర్రెలపొంటి
బండ రాళ్ళ సొరికెలపొంటి
జాలు వారేటి జలసిరులు
చెట్టు పుట్ట శిగల పై రాలే చినుకుల
స్పర్శను స్పృశిస్తూ వాడిన రెమ్మలు
ఊపిరి పోసుకునే చిగుళ్లు
వాగు వంకల యేటి రాళ్ళ
నెరికెల పొంటి గల గలలతో గంతులేస్తూ
గాలి విసర్లకు
సూక్ష్మ తెమ్మరలు అడవితల్లిని ఆవహించి
గ్రీష్మ చూపుకు రెప్ప పొరై అడ్డుపడి
పుడమి తనకు తానే
పర్యావరణాన్ని పరిరక్షించుకుంటది
ఆకలికోసమో? అవసరం కోసమో?
లెక్కించలేనన్ని సార్లు
కొమ్మలను నరికిన
కొత్తచిగుళ్ళు అల్లుకుని
పుడమికి గొడుగై రుణం తీర్చు కుంటది
కూకటి వేళ్ళతో పెకిలించనంతకాలం

-యరకల యాదయ్య
9866468979.

### ఆత్మ విశ్వాసం

గూడు కట్టిన పిట్టకు
చెట్టు మీద ఉన్న నమ్మకం
కొమ్మ నరికే వాడికేం తెలుస్తుంది.
పిట్టనమ్మింది
కొమ్మను నరికే వాడిని కాదు
తన రెక్కల బలాన్ని నమ్మింది.
జీవితంలోనూ అలాగే
మనల్ని నిలబెట్టేది
పరిస్థితులు కాదు
మన ఆత్మ విశ్వాసమే!.

– పిలుపు జ్యోతి
9912888858

### పద్మ వ్యూహం ఎగ్జిట్ తెలుసుకో!

కష్టంలోకరిగి మేఘంగా రూపుదిద్దుకున్న యువత
ఎలినినో దెబ్బకు వర్షంలేక అయోమయ భవిత!.
అవమానాలు ఎదురైనప్పుడు సహనం వీడకు
అడ్డంకులను అదృష్టంగా అధిగమించి పైకెక్కు
అసూయ అహం ఆందోళన కైపెక్కితే
మాయ సభలో దుర్యోధనులవుతారు.
నువ్వు భగభగ మండే సూర్య తాపం భరిస్తే నే
వెచ్చని వెన్నెలలు పంచే చందమామ అవుతావు.
అన్నమ్మ ఎగతాళి మాటలకు బాలచంద్రుడు
కారంపూడి కురుక్షేత్రంలో వీరాభిమన్యుడయ్యే.
ఎగతాళి మాటలను తూర్పారబడితేనే
గాలి తాకి గట్టి మాటలు మిగులుతాయి.
ఎకాఏకీ ఏకాకిగా నిర్ణయాలు ఎప్పుడు తీసుకోకు
మబ్బువై కర్షక కార్మిక దాహార్తుల దాహం తీర్చు.
నువ్వు నిత్యం నవ్వుతూ కనిపిస్తున్నావంటే
ఎన్నెన్ని కనిపించని కన్నీటి దార లొలికించావో.
శిల లాంటి నిన్ను శీలంతో శిల్పంగా మలుచుకో
దరి చేరని వాడు కూడా దండం పెడతాడు.
చెడును సుత్తితో కాదు మెత్తని మనసుతోకొట్టు
కొంటె కోతి యైన హనుమంతుడైతది.
మందలింపు పొలిమేరలు దాటుతున్న మందను
పిల్లనగ్రోవి పిలుపువై నీడకు రప్పించాలి.
ప్రతి మాట రాత సత్యమై నవ్య బాట వేయాలి
నేడు నిన్ను అవహేళన చేసిన వారే
రేపు నీ కార్యధక్షతకు అభిమానులు కావాలి!.

-పట్లొళ్ళబక్కారెడ్డి
9705315250

### నిగూఢం

వేలి సందుల్లోంచి జారిపోయిన అవకాశానికి
వెనకేదో కారణం ఉండే ఉంటుంది.
కలకూ మెలకువకూ నడుమని కలవరింతలో
ఘనీభవించిన అభద్రతేదో
ఖచ్చితంగా ఉండే ఉంటుంది.
పలకరింపుని స్వాగతించని పరధ్యాస వెనుక
అసంపూర్తి అధ్యాయమేదో నిశ్చయంగా
ఉండే ఉంటుంది.
అనూహ్యంగా అందిన నజరానాలను అందుకోలేని
సందిగ్ధత వెనుక అంతుచిక్కని కారణమేదో
తప్పనిసరిగా ఉండే ఉంటుంది.
అర్థం అయ్యీ కాని అంతరంగాన్ని
అంచనా వేయలేకా
అస్తిత్వానికీ వ్యక్తిత్వానికీ నడుమన వంతెన కట్టలేకా
సంశయంలో సతమతమయ్యే
అంతఃకరణాలెన్నో

-పద్మశ్రీ చెన్నోజ్వల

### గురివిందలు

నేనొక సంచార వనజీవిని
అరణ్యాలే నా ఆవాసాలు
స్వీయరక్షణకై తపించే ఫేరవాన్ని.
నన్ను నామాంతరాలతో దెప్పిపొడిచే
జనారణ్యపు కుమతులు
సిసలైన గురివిందలు
వింత మానవులు మీరు!.
నేను సాత్వికపు ముసుగు తొడగలేదు
సాధు జంతువును
ఎంతమాత్రం కాను
సృష్టి ధర్మం వేట నేర్పితే
అవసరం జాగరూకత నిచ్చింది
అడుగులకు మడుగులొత్తను
మెప్పుకోసం అంగలార్చనను
నయవంచనలో తలపండిన
మేకవన్నె పులులు మీరై
నాకేమో జిత్తులమారితనాన్ని అంటగట్టారు.
అనుభవం నేర్పిన పాఠాలు జీర్ణించుకొని
సంయమనంతో గమనం సాగిస్తుంటే
మొసలి నక్కంటూ గేలి చేస్తారు.
ఐన వారిని అందలాలెక్కిస్తూ
అశక్తుణ్ణి తొక్కిపడేసే మీరు
అదనుకోసం మాటువేస్తూ నన్నేమో
గోతికాడ నక్కంటూ ఈసడిస్తారు
అనుకోకుండా అదృష్టం తలుపు తట్టి
అందలం ఎక్కిన వారిని నక్కతోక తొక్కారంటూ
పొగడ్తలు గుప్పిస్తారు
సిసలైన గురివిందలు
వింత మానవులు మీరు !

-రాధికాసూరి

## న్యాయానికి విలువెక్కడ

బ్యూరోక్రసీ
ఉక్కు వలల్లో న్యాయం
విలువల విలువ లెక్కడ.
అంతం
అన్నది కనపడ దిక్కడ
అంతా వైకుంఠపాళి...
ఇక్కడంతా
గులాంలు.వీర భక్తులు
న్యాయం కరిమింగిన వెలగే..
ఆనాడు
ద్రౌపది వస్త్రాపహరణం..కథ.
నేడు కనిపిస్తూనే ఉందికదా.
కోట్లు
కోట్లకొద్ది మింగుతుంటే
ఇంకా ఏముంటుంది చివరకి.
ధర్మం
కొరకు అడుగుతుంటే
చట్టం ఉరి వేస్తుంది తుదకి..
సత్యం
భగవద్గీత సాక్షిగా
చచ్చిపోతుంది నిర్దయగా.
వ్యాజ్యం
ఎంత విలువైందైనా
పావలా దక్కదు చివరకి..
దోషి
ఎంత పెద్ద నేరం చేసినా
ఎన్నెన్నో పేరోళ్ళుసత్కారాలు
రాజ్యాంగం
పేరుకే పెద్దది మరి
భోజ్యంగా మారింది పెద్దలకి.
నిజం
నేడు బ్రహ్మపదార్థం
ఆకాశంలో దేవతావస్త్రం..
న్యాయం
ఆశించి అడుగేస్తే
న్యాయదేవతే రోదిస్తుంది...
దేశం
దిశ మారిపోయింది
సన్నాసుల హస్తలాఘవం...



-చకోనా
9885797375

## రేడియో ఆవిష్కరణ
## ప్రపంచ సమాచార విప్లవానికి పునాది



1897లో ఇటలీకి చెందిన యువ శాస్త్రవేత్త గూగ్లీమొ మార్కొని లండన్‌లో రేడియో కోసం పేటెంట్ పొందిన ఘట్టం ప్రపంచ సమాచార చరిత్రలో విప్లవాత్మక మలుపు తీసుకు వచ్చింది. వైర్లు లేకుండా దూర ప్రాంతాలకు సంకేతాలను పంప గల సాంకేతికతను విజయ వంతంగా అభివృద్ధి చేయడంలో మార్కొని సుస్పష్టమైన ముందడుగు వేసాడు. అతని ఆవిష్కరణ ఆధునిక టెలికమ్యూనికేషన్‌కు పునాది వేసింది.

మార్కొని 1874లో ఇటలీలో జన్మించి, బా ల్యం నుంచే విద్యుత్, మాగ్నెటిజం, తరంగాలపై ఆసక్తి పెంచుకున్నాడు. జర్మన్ శాస్త్రవేత్త హెయి న్‌రిచ్ హెర్ట్జ్ నిర్వహించిన ఎలక్ట్రో మాగ్నెటిక్ తరంగాల ప్రయోగాలపై లోతుగా అధ్యయనం చేసి, 1895లో తన స్వగృహంలో వైర్లను ఉపయోగించకుండా సంకేతాలను ప్రసారం చేసే ప్రయోగాలను ప్రారంభించాడు. ప్రారంభంగా కొన్ని మీటర్ల దూరానికే సంకేతాలను పంప గలిగిన ఈ పరికరాలను మరింత మెరుగు పరిచి, కిలోమీటర్ల దూరాన్ని అధిగమించే స్థాయికి చేర్చాడు.

1897 జూలై 2న బ్రిటిష్ పేటెంట్ కార్యా లయం నుండి అతనికి "వైరులేని టెలిగ్రఫీ వ్యవ స్థ"కు పేటెంట్ నంబర్ GB189612039A, మంజూరు చేసింది. అదే ఏడాది బ్రిటన్‌లో 'ది వైర్‌లెస్ టెలిగ్రాఫ్ అండ్ సిగ్నల్ కంపెనీ'ను స్థాపించాడు. ఇది తరువాత "మార్కొనీస్ వైర్‌లెస్ టెలిగ్రాఫ్ కంపెనీ"గా మారింది. ఇదే సంస్థ ద్వారా మార్కొని తన పరిశోధనలకు మరింత గతి కల్పించాడు.

1901లో మార్కొని అట్లాంటిక్ మహా సాగరాన్ని దాటి తొలిసారిగా ఇంగ్లండ్ నుంచి కెనడా న్యూఫౌండ్లాండ్ వరకు తారంగిక సంకేతాన్ని విజయవంతంగా పంప గలిగాడు. ఈ ఘనత ఆయనకు అంతర్జాతీయ ఖ్యాతిని తెచ్చిపెట్టింది. 1909లో రేడియో కమ్యూనికేషన్ రంగంలో చేసిన విశేష కృషికి గాను ఆయనకు నోబెల్ ఫిజిక్స్ బహుమతి లభించింది. ఈ పురస్కారాన్ని కార్ల్ ఫెర్డినాండ్ బ్రాన్‌తో కలసి పంచుకున్నాడు.

1912లో టైటానిక్ నౌకా ప్రమాద సమయం లో మార్కొని అభివృద్ధి చేసిన తారంగిక పరిక రాల ద్వారానే అత్యవసర సమాచారాన్ని ఇతర నౌకలకు, తీర ప్రాంతాలకు పంప గలిగారు. వందలాది ప్రాణాలను రక్షించడంలో ఈ వ్యవస్థ కీలక పాత్ర పోషించింది. ఈ సంఘటన రేడియో ప్రయోజనాలను ప్రపంచానికి పరిచయం చేసింది.

రేడియో అభివృద్ధి తరువాతి దశల్లో మరింత వేగంగా జరిగింది. 1920లో అమెరికాలో మొట్టమొదటి వాణిజ్య రేడియో ప్రసారాలు ప్రారంభమయ్యాయి. 1923లో బ్రిటన్‌లో బీబీసీ (BBC) ఏర్పాటు అయ్యింది. 1936 నాటికి నాట కాలు, సంగీత ప్రదర్శనలతో రేడియో వినోద వేదికగా మారింది. ప్రపంచ యుద్ధాల సమయం లో రేడియోను రాజకీయ ప్రచారాలకు, మానవ హక్కుల ప్రచారానికి వేదికగా వినియోగించారు.

భారతదేశంలో 1927లో మొదటి రేడియో ప్రసార కేంద్రం ముంబయిలో స్థాపించ బడింది. 1936లో ఆకాశవాణి ఏర్పడి, దేశవ్యాప్తంగా సమాచారాన్ని విస్తరించేందుకు పాలు పంచుకుంది. 1957లో ప్రారంభమైన 'వివిధ భారతి'తో పాటలు, వినోద కార్యక్రమాలు ప్రజల మనసులు గెలుచుకున్నాయి. 2001 తర్వాత ప్రైవేట్ ఎఫ్.ఎం. స్టేషన్లు రంగంలోకి ప్రవేశించి, రేడియో వినికిడి అనుభవాన్ని ఆధునికీకరించాయి.

నేటి డిజిటల్ యుగంలోనూ రేడియో తన ప్రాధాన్యతను కోల్పోలేదు. మొబైల్ ఫోన్లు, కారు స్టీరియోలు, ఆన్‌లైన్ రేడియో యాప్‌లు రేడియో వినికిడికి సులభతరం చేశాయి. నగరాల నుంచే కాదు, గ్రామీణ ప్రాంతాల వరకు కూడా ఇది సముచిత సమాచారం, వినోదం, మరియు సామాజిక అవగాహన కార్యక్రమాల వేదికగా కొనసాగుతోంది.

గూగ్లీమొ మార్కొని 1897లో సాధించిన విజయం కేవలం ఒక శాస్త్రీయ ఘట్టంగా కాక, మానవ సంబం ధాల వికాసానికి, ప్రపంచీకర ణకు, సమాచార విప్లవానికి పునాది వేసింది. రేడియో రూపంలో ప్రపంచానికి అందించిన సేవ ఆయనను శాశ్వతంగా శాస్త్ర చరిత్రలో నిలిపింది. అతని ఆవిష్కరణలతో ప్రారంభమైన ప్రయాణం ఈ రోజు డిజిటల్ కమ్యూనికేషన్ వరకూ విస్తరించి, సాంకేతిక విజ్ఞాన పరిణామంలో ఒక గాఢమైన అధ్యాయంగా నిలిచి పోయింది.

1897 జూలై 2...రేడియో కోసం పేటెంట్ పొందిన దినం



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

## రైతు భరోసాతో రైతులకు ఆర్థిక భరోసా

### -జిల్లాలో 62 రైతు వేదికల్లో ప్రత్యేక ఏర్పాట్లు
### వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్

సంగారెడ్డి, జులై 1: (నేటినిజం ప్రతినిధి):రైతులకు సకాలంలో పెట్టుబడి సాయం అందించి వ్యవసాయాన్ని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా-వానాకాలం 2026 పథకాన్ని ప్రారంభించిందని టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలజగ్గారెడ్డి అన్నారు.

హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రైతు భరోసా-వానాకాలం 2026 పథకాన్ని ప్రారంభించిన సందర్భంగా సంగారెడ్డి జిల్లా రైతు వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్, రైతులతో కలిసి రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు.ఈ సందర్భంగా నిర్మలజగ్గారెడ్డి మాట్లాడుతూ తొలి విడతలో రెండు ఎకరాల వరకు భూమి కలిగిన అర్హులైన రైతుల బ్యాంకు ఖాతాల్లో పెట్టుబడి సాయం నేరుగా జమ చేయడం ప్రారంభించారని తెలిపారు.

## వైద్యో నారాయణో హరిః!

శ్వేత వర్ణ కోటు ధరించి..
తేట తెల్లని మనస్సులతో..
మెడలో స్టెతస్కోప్ మాలతో..
లబ్ డబ్‌లతో రోగాల్ని గుర్తించి..
అమృత స్పర్శతో ప్రేమలు పంచి..
మాటల్నే ఔషధాలుగా చేసుకొని..
చిరునవ్వుతో ఆత్మవిశ్వాసం నింపి..
రోగాన్ని తరిమి ఆనందాన్ని ఇచ్చి..
పౌర శ్రేయస్సే లక్ష్యమని తలచి..
శారీరక, మానసిక, సామాజిక..
చికిత్సలతో లోక కల్యాణం చేసి..
ఆయురారోగ్యాలను వడ్డించే..
అలుపెరుగని ఆరోగ్య ప్రదాతలు
విరామమెరుగని వైద్యులు
రోగుల పాలిటి ప్రాణదాతలు
పునర్జన్మనిచ్చే దేవ దూతలు
నిబద్ధతకు నిలువెత్తు సాక్ష్యాలు
రోగులే తమ కుటుంబ సభ్యులు
వ్యాధులే తమ శత్రు మూకలు
కళ్ల ముందు కదలాడే సేవకులు
వైద్యో నారాయనో హరిః జపాలు !

-మధుపాళీ
9949700037





## వైద్యో నారాయణ

ఆసుపత్రే ఇల్లని,రోగులే నా కుటుంబమని
అను నిత్యం మన చికిత్సకై
పెంపరలాడే
వైద్యుని రూపంలో కనబడే ప్రత్యక్ష దైవమతడే.
ఎంతటి ప్రమాదకరమైన రోగికైనా
చిరునవ్వుతో చికిత్సకై పరితపించే ఆత్మీయుడతడే.
సమయ సందర్భాలేవైనా
రోగి రక్షణే తన కర్తవ్యమేయని
ప్రతి నిమిషం ఆరాట పడే ఆది దేవుడతడే.
ఆరోగ్యమే మహా భాగ్యమన్న దానికి నిజ వర్తనుడతడే
వ్యక్తి గతంగా తనకెన్ని ఇబ్బందులున్నా వదిలి
రోగి క్షేమమే తన క్షేమమనే సేవా గుణ సంపన్నుడతడే.
అందుకే
వైద్యుడు భగవంతునితో సమానుడయ్యాడు
ప్రాణ దాతగా ప్రణమిల్లడం మనందరి కనీస ధర్మం...

-దారం గంగాధర్
సెల్:9848384777

### ఓ వైద్యుడా..!

కనిపించని దేవుడికి
ప్రతిరూపం!
కని పెంచే అమ్మకు
మరో రూపం!
నిలువెల్ల జబ్బు వచ్చిన...
అనారోగ్యం మబ్బు పట్టిన
శరీరానికి శక్తివి ఔతావు!
నిరుత్సాహనికి నిలువెత్తు
నీడనౌతావు!
ఓ వైద్యుడా!
ప్రాణానికి ప్రాణం పోసే
నీకు వేల వేల ప్రణామాలు!



-నాగం సాయిలు
సెల్:9490209037

### దేవుళ్ళు వైద్యులు


అణువంత ఆలస్యం
చేయకుండా కొడిగడ్తున్న
ప్రాణాల్ని నిలబెట్టి
కన్నీళ్లతో స్నానం
చేస్తున్న తడి హృదయాలకు
స్వాంతన చేకూర్చి
నేనున్నాననే ధైర్యపు మాటలతో
చికిత్స చేస్తున్న భరోసా
దేవుళ్ళు వైద్యులు.

-వసంతాలక్ష్మణ్



జూన్ 28వ తేదిన విజయవాడలో ఆంధ్రప్రదేశ్ రచయిత సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఒక కార్యక్రమంలో చలపాక ప్రకాష్ రచన 'సెల్ నానీలు'ను ఆవిష్కరిస్తున్న సరసభారతి అధ్యక్షులు గబ్బిట దుర్గాప్రసాద్, పొన్నూరు వెంకట శ్రీనివాసులు, శర్మ సిహెచ్, డాక్టర్ గుమ్మ సాంబశివరావు, డోగిపర్తి శంకర్రావు, చలపాక ప్రకాష్, డాక్టర్ జి వి పూర్ణ చందు, బుర్రి కుమార్ రాజా, అరసవిల్లి కృష్ణ

## భీంగల్ మున్సిపాలిటీని సందర్శించిన ట్రైనీ కలెక్టర్



నిజామాబాద్, జులై 1: నిజామాబాద్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ట్రైనింగ్ కలెక్టర్ సురేష్ పాముri, ఐఏఎస్ బుధ వారం భీంగల్ మున్సిపాలిటీని సందర్శించారు. ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్న ఆయనకు కమిషనర్ డి. గజానంద్ స్వాగతం పలికారు. అనంతరం అధికారులతో సమావేశమై మున్సిపాలిటీ పరిధిలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, పరిపాలనా విధానం, పారిశుధ్య నిర్వహణ, ఆదాయ వనరులు, పౌర సేవలపై సమీక్ష నిర్వహించారు.

అనంతరం పట్టణంలోని పలు అభివృద్ధి పనులను ప్రత్యక్షంగా పరిశీలించి వాటి పురోగతిపై అధికారులకు పలు సూచనలు చేశారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా డ్రైనేజీల పరిశుభ్రత, దోమల నివారణ చర్యలు, చెత్త సక్రమ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అలాగే ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించే విధా నంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.

అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ బోదిరే నాగమణి-స్వామి, వైస్ చైర్‌పర్సన్ సంటి లత-నర్సయ్య, కౌన్సిలర్లు ట్రైనింగ్ కలెక్టర్ సురేష్ పామురిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పేద ప్రజల సంక్షేమానికే అత్యధిక ప్రాధాన్యత: ఎమ్మెల్యే

ఖమ్మం, జులై 1: తెలంగాణ ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేద ప్రజల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. స్టేషన్ ఘన్‌పూర్ పట్టణంలోని రైతు వేదికలో బుధవారం నిర్వహించిన కల్యాణలక్ష్మి?షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) చెక్కుల పంపిణీ కార్యక్రమం లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా స్టేషన్ ఘన్‌పూర్ మండలానికి చెందిన ఆరుగురు కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు రూ.6,06,696 విలువైన చెక్కులు, 37 మంది సీఎంఆర్‌ఎఫ్ లబ్ధిదారులకు రూ.13,62,700 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడు తూ రైతు రుణమాఫీ, రైతు భరో సా, సన్నాలకు బోనస్, మహిళ లకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం పంపిణీ వంటి అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోంద న్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ పేదల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కట్టుబడి పనిచేస్తున్నారని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మున్సి పల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూలుకుంట్ల లావణ్య శిరీష్ రెడ్డి, సర్పంచులు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఉమామహేశ్వర స్వామిని దర్శించుకున్న రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్



మహబూబ్‌నగర్, జులై 1:నాగర్‌క ర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం రంగాపురం గ్రామంలోని శ్రీశైల ఉత్తర ద్వారంగా ప్రసిద్ధి చెందిన శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానాన్ని రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ ఐ. రాణి కుముదిని బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆమెకు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం గణపతి పూజ, ఉమాదేవి పూజ, కుంకుమార్చన, స్వామివారి అభిషేక పూజలను శాస్త్రోక్తం గా నిర్వహించారు. పూజల అనంతరం అర్చకులు శేషవస్త్రంతో సన్మానించి వేద ఆశీర్వచనం అందజేశారు.

ఈ సందర్భంగా రాణి కుముదిని ఆలయ చరిత్ర, విశిష్టత గురించి అర్చకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆలయ పరిసర ప్రాంతాల్లోని పాపనాశనం, ప్రకృతి అందాలు, జలధారలను వీక్షించారు. ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో ఎంతో ఆహ్లాదకరంగా ఉందని ఆమె అభిప్రాయపడ్డారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.